# ఐదు ఏనుగులు తమిళనాడులోకి

## - మూడు ఏనుగులు రామకుప్పంలోకి.. వరిపంట ధ్వంసం



కుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త

తమిళనాడునుంచి రెండు బృందాలుగా వచ్చిన ఎనిమిది ఏనుగుల్లో ఐదు ఏనుగుల గుంపును అటవీ అధికారులు తమిళనాడులోని నెర్లకోట అటవీ ప్రాంతంలోకి తరిమేశారు. ఈ ఏనుగులు పైపాళ్యం అటవీ ప్రాంతంలో ఉండగా అటవీ అధిక్కారులు, సిబ్బంది దారి మళ్లించి వాటిని తమిళనాడులోని తరిమేశారు. కుప్పం మండలం కంగుంది రిజర్వ్‌ఫారెస్ట్‌కు చేరుకున్న మరో మూడు ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి కంగుంది గ్రామ సమీపంలోకి వెళ్లి తిర్లావానిబండ గ్రామం మీదుగా రామకుప్పం మండలం బళ్ల అటవీ ప్రాంతంలోకి ప్రవేశించాయి. ఈఏనుగులు రాగిపంటను కొంతమేర ధ్వ ంసం చేశాయి. మరో పక్క రామకుప్పం మండలంలోని బళ్ల, వీర్నమల ప్రాంతాల్లో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో జయశంకర్ అధ్వర్యంలో ప్రజలకు అవగాహనకల్పిస్తున్నారు.




# ఏసీబీ వలలో విలేజ్ సర్వేయర్



పుంగనూరు రూరల్, డిసెంబర్ 17 ప్రభాతవార్త

పుంగనూరు రూరల్ మండలం మంగళం పంచాయతీకి చెందిన భూమి సర్వే కోసం లంచం తీసుకుంటూ విలేజ్ సర్వేయర్ శ్రీరాములు బుధవారం ఏసీబీకి పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళం పంచాయతీకి చెందిన ఉమాశంకర్ తన భూమి సర్వే కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే సర్వేయర్ శ్రీరాములు సర్వే సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి అంగీకరించి ఉమాశంకర్ బుధవారం అడ్వాన్స్ లంచం రూ 20వేలు ఇవ్వడానికి సిద్ధం చేసుకుని ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ కార్యాలయంలోనే విలేజ్ సర్వేయర్ కు డబ్బు లంచం ఇచ్చే సమయంలో ఏసీబీ అధికారులు ప్రవేశించి ప్రత్యక్షంగా పట్టుకున్నారు. ప్రభుత్వాలు మారినా లంచాల వ్యవహారం పుంగనూరులో మారలేదనడానికి ఈ సంఘటన ప్రత్యక్ష ఉదాహరణ. పట్టుబడిన విలేజ్ సర్వేయర్ ను అధికారులు నెల్లూరు కోర్టుకు తరలించారు.

# కలెక్టర్లు బ్రాండ్ అంబాసిడర్లు

## - మన విధానం 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్'
## - పిపిపితోనే మెరుగైన వైద్య సేవలు
## - కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబునాయుడు



సిఎం నిర్వహించిన కలెక్టర్ల సమావేశానికి హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్.

చిత్తూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త:

కలెక్టర్లు ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా విధులు నిర్వర్తించాలని, ప్రభుత్వంపై సానుకూలత రావాలంటే అధికారులదే కీలకపాత్ర అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ గురించి చర్చించుకునేలా ప్రభుత్వంపై ప్రజలకు వున్న విశ్వసనీయత కొనసాగించేలా సిఎం అధికారులకు మార్గనిర్దేశం చేశారు. విజయవాడలోని రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు జరుగనున్న కలెక్టర్ల సమావేశంలో బుధవారం సిఎం నారా చంద్రబాబునాయుడు కలెక్టర్లకు వివిధ అంశాలపై సూచనలు చేశారు. కలెక్టర్లు తమ ప్రతిభ ద్వారా కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా చూడాలని, ఇకపై రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ వుండాలని దిశా నిర్దేశం చేశారు. అలాగే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహా విధానాన్ని పరిపాలనలోను తీసుకువస్తున్నట్లు సిఎం ప్రకటించారు. కొన్ని జిల్లాలు అనుసరించే బెస్ట్ ప్రాక్టీసెస్ ఇతర జిల్లాలోను అమలు చేయాల్సిన అవసరం వుందన్నారు. కొన్ని అంశాల్లో ప్రజా ప్రతినిధుల సేవలను వినియోగించుకోవాలని కలెక్టను సూచించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎవరైనా నిత్య విద్యార్థుల్లా వుండాలని, నిరంతరం వివిధ అంశాలను తెలుసుకుంటూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. నీటి సమస్యలు, మద్దతు ధరలు లేకపోవడం, భూ వివాదాలు, విద్యుత్ బిల్లులు ఎక్కువ రావడం లాంటి సమస్యలు గత ప్రభుత్వం నుండి వారసత్వంగా వచ్చాయని, ప్రస్తుతం నీటి భద్రత తీసుకురావడం జరిగిందని, రైతులకు మెరుగైన ధరలు దక్కేలా చూస్తున్నామన్నారు. రెవెన్యూ శాఖలో కొంతమంది పని చేయకుండా వుంటున్నారని, ఫైళ్లను పరిష్కరించకుండా తమ వద్ద నుండి ఇతరులకు పంపివేస్తున్నారన్నారు. ఇకపై ఫిర్యాదులన్నింటికీ పరిష్కారం చూపాలన్నారు. పేదలకు ఆర్థిక అండ కల్పించడానికి సూపర్ సిక్స్ పక్కాగా అమలు చేశామని, సామాజిక భద్రతా పెన్షన్లు మొదటి తేదీని ఇస్తున్నామని, తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు వుంటే అంతమందికి నిధులు చెల్లిస్తున్నామన్నారు. పిపిపి పద్ధతిలో వైద్య సేవలు మరింత మెరుగుపడుతాయని, వైద్య కళాశాలలు ప్రైవేటు పరం చేసేశారని కొందరు మాట్లాడుతున్నారని, పిపిపి విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణం చేపడుతున్నా అవి ప్రభుత్వ మెడికల్ కళాశాలల పేరుతోనే నడుస్తాయని, కళాశాలల నిబంధనలు సైతం రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిస్తుందని సిఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, వివిధ శాఖల మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ కార్యదర్శులు, కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు

# ఘనంగా స్వాగతం... వీడ్కోలు.



రేణిగుంట డిసెంబర్ 17 ప్రభాతవార్త...

భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము కు రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం ఘనంగా స్వాగతం లభించింది. వాయుసేనకు సంబంధించిన వాయుదూత్ విమానంలో ఆమె రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆమెకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎక్స్ అఫ్సియో రెవిన్యూ ఎండోమెంట్ సెక్రటరీ హరి జవహర్లాల్, అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి బాజ్ పాయ్, తిరుపతి జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె ప్రత్యేక హెలికాప్టర్లో తమిళనాడు వేలూరు లోని స్వర్ణ దేవాలయానికి బయలుదేరి వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి అదే హెలికాప్టర్లో రేణిగుంట విమానాశ్రయం చేరుకొని ప్రత్యేక వాయుదూత్ విమానంలో హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో భారత రాష్ట్రపతికి రాష్ట్ర మంత్రి సవిత కొండపల్లి బొమ్మలను అందజేసి మంగళగిరి కలంకారి8 శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

# దక్షిణ భారతదేశంలోనే అత్యుత్తమ ఆసుపత్రిగా స్విమ్స్ అభివృద్ధి

## టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బిఆర్ నాయుడు



తిరుపతి హెల్త్, డిసెంబర్ 17, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్)ను దక్షిణ భారతదేశంలోనే అత్యుత్తమ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నామని టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బిఆర్ నాయుడు వెల్లడించారు. చైర్మన్ బుధవారం సెంట్రల్ మెడికల్ గోడౌన్, రోగుల సహాయకుల కోసం అదనపు అంతస్తులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ రూ.10.65 కోట్లతో 37 వేల చదరపు అడుగులు విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో సెంట్రల్ మెడికల్ గోడౌన్ ప్రారంభించామని, ఇందులో మెడికల్ స్టోర్లు, జనరల్ స్టోర్లు, కోల్డ్ స్టోరేజ్, ఆపరేషన్ థియేటర్ స్టోర్లు, కార్యాలయాలు, సమావేశ మందిరం ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా రూ.4 కోట్ల 40 లక్షల వ్యయంతో 300 మంది రోగుల సహాయకులు వేచివుండేందుకు వీలగా విశ్రాంతి భవంలోని 2, 3వ అదనపు అంతస్తులను ప్రారంభించినట్టు తెలిపారు. ఇందులో రోగుల సహాయకులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలతోపాటు మరుగుదొడ్లు, లిఫ్టులు ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఈ సందర్భంగా ఈ రెండు భవనాలలో కల్పించిన సౌకర్యాల గురించి స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ చైర్మన్‌కి వివరించారు. టీటీడీ ఆధ్వర్యంలో సెంట్రల్ మెడికల్ గోడౌన్, రోగుల సహాయకుల కోసం అదనపు అంతస్తులను నిర్మించినట్టు చెప్పారు. స్విమ్స్ మెయిన్ బిల్డింగ్లో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని, అనంతరం అన్ని ల్యాబ్లను ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చి సెంట్రల్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. శ్రీ పద్మావతి ఆసుపత్రి ఎదుట గల మెడికల్ షాపును స్విమ్స్ ఆధ్వర్యంలోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. . స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీటీడీ చైర్మన్ ఆధ్వర్యంలో స్విమ్స్‌లో పలు భవనాల నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా స్విమ్స్ యూనివర్సిటీ విద్యార్థుల కోసం ఏడాది క్రితం 150 గదులతో హాస్టల్ భవనాలు ప్రారంభించామన్నారు. రెండో దశలో సెంట్రల్ మెడికల్ గోడౌన్, రోగుల సహాయకుల కోసం అదనపు అంతస్తులను ప్రారంభించామని, అతిత్వరలోనే టిటిడి సహకారంతో స్టాఫ్ క్వార్టర్స్, సెంట్రల్ కిచన్, 350 అదనపు పడకలు, 5 ఆపరేషన్ థియేటర్లు, 5 ఐసియులతో అడ్వాన్స్ క్యాన్సర్ కేర్ సెంటర్ భవనాలను అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సదాశివరావు, శాంతారాం, నరేష్ కుమార్, టిటిడి జెఈవో వీరబ్రహ్మం, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జి.జగదీష్, చీఫ్ ఇంజినీర్ శ్రీ టివి. సత్యనారాయణ, స్విమ్స్(టిటిడి) ఇంజినీర్లు ప్రసాద్, పార్థసారథి, బాలాజి తదితర ఇంజినీరింగ్ సిబ్బంది, తిరుపతి మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, తిరుపతి నగర డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, ఇతర నాయకులు, టిటిడి, స్విమ్స్ ఉన్నత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు కోసం..రెండోరోజు దీక్షలు




కోట, డిసెంబర్ 17 ప్రభాతవార్త

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని కోట మండల జెఎసి నాయకులు జనార్ధనం, జిమ్మ ప్రసాద్‌లు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం రెండోవ రోజు నిరశన రిలేదీక్షలు కోట క్రాస్ కొనసాగించారు. ఈసందర్భంగా వారఉ మాట్లాడుతూ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపకపోతే గూడూరును జిల్లా కేంద్రం చేయడానికి అన్ని రకాల ఆర్థిక వనరులు, సిలికా, ఆక్వా, క్వార్ట్జ్, క్రిస్ సిటీ, సముద్రతీరం, నిమ్మ ఎగుమతులు, త్వరలో ఏర్పాటు కానున్న దుగరాజపట్నం పోర్టు, సాగరమాల రోడ్డు, పెద్ద విద్యాసంస్థలు ఉన్నాయని చెప్పారు. గతంలో ఎన్నికల సమయంలో స్వయాన ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని, అదేవిధంగా లోకేష్‌బాబు యువగళం పాదయాత్ర సమయంలో కోటలో ఇదే హామీ ఇచ్చారని చెప్పారు. సామాన్య ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే 120కిలోమీటర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తుందని చెప్పారు. వంద సంవత్సరల పైగా చరిత్ర కలిగిన నెల్లూరు జిల్లాతో గూడూరు కు ఉన్న సంబందంను ప్రభుత్వం వీడదీయటం మంచిది కాదన్నారు. ఒక వ్యక్తి స్వార్థం కొరకు నియోజక వర్గం ప్రజల మనోబావాలను దెబ్బతీయడం సరికాదన్నారు. ఈ దీక్షలో ఆర్గనైజింగ్ సెక్రటిరి మీజారు మల్లిఖార్జున్‌రావు, యుటిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు మువ్వల మనోహర్, పనబాక హేమంత్, పాల మల్లి తదితరులు ఉన్నారు. ముమ్మడి సుబ్బయ్య, పోలయ్య, భపాతిఅల్లంపాడు సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### మణికంఠేశ్వరాలయంలో

# ఘనంగా ప్రదోషకాల పూజ



కాణిపాకం, డిసెంబర్ 17 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాయలంలో బుధవారం ప్రదోషకాల పూజలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా ఆలయంలో త్రయోదశి రోజున ప్రదోష కాల సమయంలో మణికంఠేశ్వరాలయంలో ప్రదోష కాల పూజలను నిర్వహిస్తున్నారు. ఈమేరకు బుధవారం రాత్రి ఆలయంలో ప్రదోష కాల మందు ఆలయ అర్చకులు వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ స్వామివారి మూల విరాట్‌తో పాటు స్వామివారి వాహనం నందికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతర ం అలంకరించి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు, వేదపండితులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

# కార్వేటినగరంలో కోలాహలంగా గంగజాతర



పండ్లతో అలంకరించిన బంగారమ్మ ఆలయ దృశ్యం, కార్వేటినగరం గంగమ్మ

కార్వేటినగరం,డిసెంబరు 17 ప్రభాతవార్త:

కార్వేటినగరంలో మంగళ,బుధవారాల్లో గంగజాతర కోలాహలంగా జరిగింది. మంగళవారం గ్రామదేవతయిన బంగారమ్మ ఆలయాన్ని వివిధ రకాల పండ్లతో అలంకరించారు.ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్ళుపెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే నాలుగు సరిహద్దులైన అళ్ళరాళ్ళ వద్ద పొంగళ్ల పెట్టారు.కార్వేటినగర పురవీధుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు.మంగళవారం ఉదయం ప్రతిఇంటా అంబళ్ళు పోశారు.మంగళవారం రాత్రి 12.30గంటలకు గంగమ్మ,బంగారమ్ములను అలంకరించి ఊరేగింపు ప్రారంభమైంది.యువత పిల్లలు,పెద్దలు తారతమ్యం లేకుండా నృత్యాలు చేస్తూ ఊరేగించారు. వివిధ వేషధారణలతో ప్రదర్శిస్తూ ప్రజలను అలరింపజేశారు. అమ్మవారు ఊరేగింపుగా వచ్చి నాలుగురాళ్ళ వద్ద ప్రతిష్టింపజేశారు. అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు.గంగజాతరను పురస్కరించుకొని కార్వేటినగరంలో జనసందోహంతో నిండిపోయింది. ఈ ఏడాది వేషదారణలు ఎక్కువగా కనిపించడం విశేషం.సాయంత్రం గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్ళి నిమజ్జనం చేయడం జరిగింది. గ్రామం సుభిక్షతంగా వుండాలని బలి చల్లడం జరిగింది.కార్వేటినగరంలో ఎన్నడూ జరగని రీతిలో గంగజాతర జరగడం విశేషం. సి.ఐ.హనుమంతప్ప,యస్.ఐ తేజశ్విని పోలీసులతో పకడ్బందిగా బందోబస్తు నిర్వహించారు.

### నారా సుహాసిని కుటుంబ సభ్యులకు

# నారా భువనేశ్వరీ పరామర్శ



చంద్రగిరి, డిశంబర్ 17 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబానికి సమీప బంధువు నారా సుహాసిని కుటుంబ సభ్యులను బుధవారం నారా భువనేశ్వరీ పరామర్శించారు. ముఖ్యమంత్రి స్వగ్రామం నారావారిపల్లికి బుధవారం ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఎంఎల్ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ నెల 9న నారా సుహాసిని కాలం చేశారు. ఈ నేపథ్యంలో ఆమె సుహాసిని నివాసానికి చేరుకుని ముందుగా సుహాసిని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులతో కలసి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం నారావారిపల్లి ఆసుపత్రిలో వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అంటూ ఆరా తీశారు. ఈ క్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తమ వైద్య సిబ్బంది, ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. అనంతరం తమ నివాసానికి చేరుకుని కొంత సమయం విశ్రాంతి తీసుకుని తిరిగి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో నారా ప్రతాప్ నాయుడు, నారా సుబ్రమణ్యం నాయుడు, సింగు చంద్రబాబు నాయుడు, నిరంజన్, చరిత, గ్రామస్థులు పాల్గొన్నారు.

# దణ్ణం పెడతాం...హెల్మెట్ ధరించి రండి

## -తిరుమల ట్రాఫిక్ పోలీసులు



తిరుమల, డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:

ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహన దారులు తలకు హెల్మెట్ ధరించి బండి నడపాలని తిరుమల ట్రాఫిక్ పోలీసులు దణ్ణం పెట్టి మరీ వేడు కుంటున్నారు. తిరుమలకు ద్విచక్ర వాహనాల్లోవస్తున్న వాళ్ళందరూ హెల్మెట్‌తోనే రావాలని కోరారు.

# ఇదేమీ చోద్యం ....

## సెల్‌ఫోన్ మాట్లాడుతూ బండిడ్రైవింగ్.. ప్రమాదమని తెలిసినా అడిగేవారేదీ!?



ప్రభాతవార్త-తిరుపతి:

రోడ్డుప్రమాదాల నివారణకు పోలీసులు హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తున్న ఇప్పుడు నగరంలో చాలాచోట్ల బండినడుపుతూ సెల్‌ఫోన్‌లు మాట్లాడుతున్నా పోలీసులు చూడటంలేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. హెల్మెట్ లేకుంటే జరిమానాలు కాదని, ప్రాణాలతో చెలగాటమాడేలా సెల్‌ఫోన్ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలను నడపడం ప్రమాదమని పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. రెండురోజులుగా కూడా నగరంలో దాదాపు హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపిన వారే అధికంగా ఉన్నారు. పోలీసుల చోద్యం చూస్తారా ...అవగాహన, చైతన్యం కల్పిస్తారా అనేది చూడాల్సి ఉందే.

# స్వర్ణముఖిని దోచేస్తున్నారు!! గంగ ఆనకట్ట మట్టిని తోలేస్తున్నారు..

తొట్టంబేడు,డిసెంబర్ 17 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలం అక్రమ వ్యాపారులకు అడ్డాగా మారింది. పగలు మట్టి,రాత్రి ఇసుక అక్రమరవాణా యధేచ్ఛగా సాగుతుంది. అయితే అధికారులు పట్టించుకోవటం లేదు. తొట్టంబేడు మండలం,పెళ్ళకూరు మండలంలోని స్వర్ణముఖి నదిలోని ఇసుకను పగలు రేయి తేడా లేకుండా తరలిస్తున్నారు. తొట్టంబేడు మండలంలో డపింగ్ యార్డులో నిల్వ చేసుకొని ఇక్కడ నుంచి చెన్నైకు అక్రమంగా రవాణా సాగిస్తున్నట్లు జనం గొల్లుమంటున్నారు.అయినా ప్రజల ఆవేదనను,ఆర్తనాదాలను పట్టించుకునే దిక్కు ఎవరు?ఇప్పటి వరకు చెరువుల్లో మట్టిని కొల్లగొట్టిన ఘనులు ప్రస్తుతం తెలుగుగంగ కాలవ గట్టునుకూడా వదలిపెట్టడం లేదు. అసలే తెలుగుగంగ కాలువ అంతంత మాత్రం ఈ కాలువ గట్టు వద్ద మట్టి అక్రమ రవాణాకు నిలయంగా మారింది. రాత్రి వేళల్లో విచ్చల విడిగా ఈ ఆక్రమ రవాణా సాగుతున్నట్లు జనం చర్చించుకుంటున్నారు. ఆక్రమరవాణాని అరికట్టలేరు కానీ ప్రశ్నిస్తే పోలీసు కేసులు బనాయిస్తారని ఎవ్వరూ పెదవి విప్పటం లేదు.మట్టి అక్రమరవాణాతో కొట్లు దండుకుంటున్నారు.ఇటీవల ఈ మట్టి అక్రమరవాణా వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు.అయితే అధికారుల కళ్ళు కప్పి కార్యాలయాల సెలవు దినాలు,రాత్రి వేళల్లో తమ వ్యాపారాన్ని సాగించుకుంటున్నారు.ఇటీవల తాటిపర్తి పంచాయతీలోని కొమ్మనగుంట గ్రామ సమీపంలోని తెలుగుగంగ గట్టు పక్కన మట్టిని తొలగిస్తున్నారు. దాంతో కట్ట పరిస్థితి అందోళన కరంగా మారింది.అయితే తెలుగుగంగ గట్టులను కాపాడాల్సిన అధికారులు తిరుపతిలో కార్యాలయం ఉండటంతో ఇక్కడ 'అక్రమార్కుల దందాకు' అడ్డూ ఆపు లేకుండా పోయింది. వ్యవస్థలను కాపాడాల్సిన పాలకులు పట్టించుకోకపోతే రాబోయే పరిస్థితికి బాధ్యులౌతారు.



తెలుగు గంగ గట్టును తవ్వేస్తున్న దృశ్యం

# వ్యక్తిగత విషయాలు పార్టీపై రుద్దొద్దు

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్
- తెదేపాలోకి 220 కుటుంబాల చేరిక.. సాదర స్వాగతం !!

శాంతిపురం, డిసెంబర్ 17 ప్రభాతవార్త తమ వ్యక్తిగత విషయాలను నేతలు, కార్యకర్తలు పార్టీపై రుద్దవద్దని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్‌డా॥ కంచర్ల శ్రీకాంత్ సూచించారు. బుధవారం స్థానిక న ందిగం కళ్యాణ మండపంలో జరిగిన మండల టిడిపి సమావేశానికి ఆయన హాజరై ప్రస ంగించారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలన్నారు. కృష్ణాజలాలతో కుప్పం ప్రాంతం సస్యశ్యామలవు తుందన్నారు. కెఎస్ఎస్‌ల పరిధిలో ఎంతమంది నేతలు కుటుంబాలను కలసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడుకు 36వ స్థానం వచ్చిందని ఇది ఎవరి లోపం అని ప్రశ్నించారు. నేతలు ప్రజలతో మాట్లాడే సమయంలో ఆచితూచి మాట్లాడాలని సూచించారు. గ్రామస్థాయిలో సమన్వయ లోపం సరిదిద్దుకోవాలన్నారు. అధిష్టానం స్థానిక ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇచ్చినాఅందరూ అంకితభావంతో పనిచేసి మండలంలో క్లీన్ స్వీప్ సాధించాలన్నారు. కొంతమంది తనపేరు



చెప్పుకుని అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసిందని ఈ విషయంలో ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 72వేల ఓట్లు ఇతర పార్టీకి ఎలా పడ్డాయనే విషయంగా నేతలు ఆలోచించాలన్నారు. కుప్పంనేతల్లోమార్పు రావాలన్నారు. మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూనేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ముందుకుసాగాలని సూచించారు. అంతకుముందు ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ ప్రసంగించారు. ఈసందర భంగా మండలంలోని 23 పంచాయతీలనుంచి 220 కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. కార్యక్రమంలో నేతలు ఉదయ్‌కుమార్, విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, చంద్ర, గోపాల్, రాజు, నాగరాజు, రమేష్, శివ, బాలు, గోవిందరాజులు, చలపతి, బాలకృష ్ణనాయుడు, దాము,సుగుణమ్మ,చంద్రకళ, అనసూయ, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రామకుప్పం :** మండలంలోని కెంచనబళ్లకు చెందిన 25 కుటుంబాలు వైకాపాను వీడి తెదేపాలో చేరాయి. వీరిని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీవైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, ప ట్ర నారాయణ, కామరాజునాయక్, విశ్వనాథ్, సులోచన గుర్రప్ప, రవిరెడ్డి, నాగభూషణం, శ్రీనివాసులురెడ్డి, రామూర్తి, జయశంకర్, రఘు,చం ద్రశేఖర్‌రెడ్డి,ఆదిల్, సతి ్త,

## కెఐసిలో జెఎన్‌టియుఎ క్రీడా జట్ల ఎంపిక పోటీలు



**కుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త** కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో అనంతపురం జెఎన్‌టియుకు సంబంధించి బాడ్మింటన్ (పురుషులు, మహిళలు) జట్ల ఎంపిక పోటీలను విజయవంతంగా నిర్వహించారు. జెఎన్‌టియు పరిధిలోని 22 అనుబంధ కళాశాలలనుంచి 92మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంకు జెఎన్‌టియుఎ స్పోర్ట్ కౌన్సిల్ కార్యదర్శి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ పోటీల్లో కెఐసికి చెందిన ముగ్గురు మంది విద్యార్థులు జెఎన్‌టియుఎ జట్టుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ డా॥ బిసి నాగరాజ్,వైస్‌ఛైర్మన్‌డా॥ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, పిడి సతీష్‌కుమార్, డా॥ శరవణ, సత్యమూర్తి,వివేక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

**కుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త** కుప్పం తాలూకా యూనిట్ పెన్షనర్ల అసోసియేషన్ అధ్వర్యంలో స్థానిక ఎన్జీఒ భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్స వంను ఘనంగా నిర్వహించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిజి సెల్వం, గణేష్ పిళ్లైల అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తహశీల్దార్ చిట్టిబాబు, కమీషనర్ శ్రీనివాసరావు అతిథులుగా హాజరయ్యారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు చంద్రశేఖర్, విజయకు మార్, రఘునాథ ం, షఫీఉల్లా, చిన్నరాజులను ఘన ంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా పెన్షనర్ల సంఘ కార్యదర్శి వెంకటేష్, మహిళాసభ్యులు కెవి శ్రీదేవి, శిరీష, ఉమామహేశ్వరి,మంజుల,వాణిశ్రీ, కమలమ్మ, పవనకుమారి పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారంకు చర్యలు చేపట్టాలి

పికెఎం ఉడా ఛైర్మన్ డా॥బిఆర్ సురేష్‌బాబు



**కుప్పం, డిసెంబర్ 17ప్రభాతవార్త** కుప్పం సమీపం గుండ్లసాగరం పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారంకుఅధికారులుచర్యలు చేపట్టాలని పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు ఆదేశించారు. బుధవారం ఆయన గుండ్లసాగరం, గుత్తార్లపల్లి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్ర ం, స్మశాన వాటికను పరిశీలించి అవసరమైన పనులు చేపట్టేందుకు అధికారులను సూచించారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని మౌలిక వసతుల కల ్పనకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీతారాం, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## రైతులు పట్టుసాగు విస్తారంగా చేపట్టాలి

- ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు



**గుడుపల్లె , డిసెంబర్ 17 ప్రభాతవార్త** మండలంలో రైతులు పట్టుసాగును విస్తారంగా చేపట్టాలని ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు కోరారు. బుధవారం మండల వెలుగు కార్యాలయంలో పట్టుశాఖ, ఉపాధిహామీ, పట్టు రైతుల సమావేశం జరిగింది. పట్టుసాగు చేపట్టే రైతులకు పెద్ద షెడ్‌కు 3.37లక్షలు, చిన్నషెడ్‌కు 2.47లక్షలు,నారు కోసం ఎకరాకు రూ22500లు కూటమి ప్రభుత్వం రాయితీగా అందిస్తోందన్నారు. రీలింగ్ యూనిట్లకు కూడా 1.5కోట్ల యూనిట్‌కు కూటమి ప్రభుత్వం 1.12కోట్ల రాయితీ ఇస్తుందని ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో మండలటిడిపి అధ్యక్షుడు సుబ్రమణ్యం, వైస్ ఛైర్మన్ శరవణ, ఎడి మోహన్‌బాబు, ఎపిఒ, ఎఎంసి డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

**శాంతిపురం, డిసెంబర్ 17 ప్రభాతవార్త** ఈనెల 21న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపిడిఒ పిఆర్ కుమార్, తహశీల్దార్ ప్రకాష్‌బాబు కోరారు. బుధవారం పల్స్ పోలియోపై జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో వారు మాట్లాడారు.మండలంలో6697మంది 0-5ఏళ్ల లోపు చినా ్నరులు ఉన్నట్లు గుర్తించామన్నారు.వీరికి52కేంద్రాల్లో పోలియో చుక్కలు వేసేలా చర్యలు చేపట్టామన్నారు.సమావేశంలో వైద్యాధికారి వంశీకృష్ణ, ఎంఇఒ చంద్రమ్మ, సెల్వకుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.



## అభివృద్ధి..సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యం



**రామకుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త** అభివృద్ధి, స ంక్షేమం సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మండలంలోని బాల ఓబనపల్లి గ్రామంలో 14లక్షలతో నూతనంగా నిర్మించే సిసి రోడ్డు నిర్మాణంకు వారు భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి కడ ద్వారా అవసరమైన నిధులు కేటాయించడం జరుగుతోం దన్నారు. కార్యక్రమంలో మునస్వామి, ప ట్ర నారాయణ, కామరాజునాయక్, విశ్వనాథ్, సులోచన గుర్రప్ప, రవిరెడ్డి, నాగభూషణం, శ్రీనివాసులురెడ్డి, రామూర్తి, జయశంకర్, రఘు,చం ద్రశేఖర్‌రెడ్డి,ఆదిల్, సతి ్త, శంకరాచలం, కృష్ణారెడ్డి, బాలకృష్ణపాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకోవద్దు.. రోడ్డువిస్తరణకు సహకరించాలి

**పెద్దపంజాణి, డిసెంబర్ 17 ప్రభాతవార్త** అభివృద్ధికి ఆటంకాలు సృష్టించేవారి మాటలను ప్రజలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోరాదని ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని రాయలపేట గ్రామంలో పర్యటించి స్థానికులతో సమావేశమయ్యారు. రాయలపేట రోడ్డువిస్తరణ కు ప్రజలు సహకరించాలన్నారు. పేదలకు న్యాయం చేయడంతో పాటు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్డువిస్తరణలో పూర్తిగాఇళ్లు కోల్పోయే వారికి గ్రామంలోనే స్థలంతో పాటు పట్టా ఇప్పిస్తామని పేర్కొన్నారు. అక్కడికక్కడే ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడి వెంటనే పనులు మొదలు పెట్టాలనిఆదేశించారు. కార్యక్రమంలో నేతలు మురహరిరెడ్డి,సుధాకర్‌రెడ్డి,శ్రీరాములు ,జయరాంరెడ్డి,రవి, నోమురాజు, చంద్ర, బుద్ధు,బాలు పాల్గొన్నారు.



## ఘనంగా ఇంధన పొదుపు వారోత్సవాలు



**పెద్దపంజాణి, డిసెంబర్ 17 ప్రభాతవార్త** విద్యుత్ శాఖ అధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత ్సవాలను మండలంలోనిరాయలపేట హైసూ ్కల్‌లోఘనంగా నిర్వ హించారు. ఈసందర్భంగా విద్యుత్ ఆదాపై విద్యా ర్థు లకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమ తులు అందించారు.ఎఇలుశ్రీనివా సమూర్తి, వెంకట రమణ ,ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇద్దరు చైన్ స్నాకర్స్ అరెస్ట్:బంగారు చైను, బైక్ స్వాధీనం

**తవణంపల్లె, డిసెంబర్ 17 ప్రభాతవార్త:** మహిళ మెడలో చైన్ చోరీ చేసిన ఇద్దరు నిందితులను బుధవారం అరెస్ట్ చేసి వారి వద్ద నుండి నాలుగు సవర్ల బంగారు చైన్, చోరీకి ఉపయోగించిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై చిరంజీవి తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని మైనగుండ్లపల్లెకు చెందిన లలిత అనే మహిళ ఈనెల 12న మైనగుండ్లపల్లె బ్రిడ్జి వద్ద నడిచి వెళుతుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మహిళ మెడలోని బంగారు చైన్‌ను చోరీ చేసి ఎత్తుకెళ్ళారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి బెంగుళూరు-తిరుపతి హైవే కె.పట్నం ఫ్లైఓవర్ వద్ద బుధవారం మధ్యాహ్నం నెల్లూరు జిల్లా, బోగోలు మండలం కప్పరాళ్ళ తిప్ప గ్రామానికి చెందిన తుపాకుల హనోక్ కుమార్(33),నగిరి మండలం ఓజి.కుప్పంకు చెందిన సామ్యేల్ రాజ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారివద్దనుండిచోరీకిగురైన 32గ్రాముల బంగారుచైన్,మోటారుసైకిల్‌ను స్వాధీనంచేసుకున్నట్లు తెలిపారు.

## బోయకొండ గంగమ్మకు గంట బీరువాలు వితరణ



**గడ్డంవారిపల్లి(చౌడేపల్లి), డిసెంబర్ 17 ప్రభాతవార్త** మండలంలోని పంచాయతీ కేంద్రం గడ్డంవారిపల్లిలో గల శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ ఆలయానికి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. అదే గ్రామానికి చెందిన ఓబులేషు, అనూరాధలు పంచలోహ గంట, శివారిపల్లి అంకన్న, అలివేలమ్మలు బీరువాను విరాళంగా అందించారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

### బిఎస్ఎస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**చౌడేపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త** బహుజన సేవా సమితి నూతన కమిటీని ఎన్నుకొన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఆపార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండ్లూరు కృష్ణమూర్తి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గుండ్లూరు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఏకగ్రీవ ఎన్నికల్లో గౌరవాధ్యక్షుడుగా పోదపల్లి రమణ, మండలాధ్యక్షుడుగా పరికిదొన చెంగల్‌రాయుడు, ప్రధాన కార్యదర్శిగా బస్టాండు శేఖర్, సహాయ కార్యదర్శులుగా దుర్గసముద్రం శ్రీనివాసమూర్తి, బిసికాలనీ శేఖర్, ఉపాధ్యక్షులుగా లద్దిగం మునస్వామి, శెట్టిపేట శంకర, నరేష్, కోశాధికారిగా పెద్దూరు గంగాధర్ మరో 12మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.

## ఉపాధ్యాయ క్రికెట్‌లో పెద్దపంజాణిదే విజయం



**చౌడేపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త** ఉపాధ్యాయ క్రికెట్‌లో పెద్దపంజాణి మండలం విజయం సాధించింది. పలమనేరు డివిజన్ స్థాయిలో రాజులూరు వద్దగల నారాయణరాజు మైదానంలో జరుగుతున్న ఉపాధ్యాయ క్రికెట్ టోర్నమెంటు నందు 10టీములు తలబడ్డాయి. గత 4రోజుల పాటు జరిగిన మ్యాచ్‌లో చివరకు పెద్దపంజాణి, పుంగనూరు టీములు ఫైనల్‌కు వెళ్ళాయి. ఇరుటీముల మధ్య జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో చివరకు పెద్దపంజాణి మండల ఉపాధ్యాయులు విజయకేతనం ఎగరేశారు.

## కూటమి ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యత : గువ్వల

**చౌడేపల్లి, డిసెంబర్ 17 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తేదేపా మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అన్నారు. స్థానిక పరిపాలన భవన సముదాయంలో సర్వశిక్ష నిధులు రూ. 53లక్షలతో మంజూరైన బిఆర్‌సి భవన నిర్మాణానికి భూమి పూజ చేసారు. విద్యతోనే సమాజ మనుగడ సాధ్యమని భావించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లు విద్యాభివృద్ధి కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. అనంతరం భూమి పూజను చేసారు. ఎంపిడిఓ లీలామాధవి, ఎంఇఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, తేదేపా నాయకులు ఆవుల రామచంద్రయ్య, పూల చంద్రమౌళి, వేలూరు సుబ్రమణ్యం, పవన్ కుమార్, వెంకట్రమణ, జంపాల శ్రీనివాసులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



## ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ



***పెనుమూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త:*** రైతులు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ద చూపాలని ఎంపిడిఓ నీలకంఠేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పులిగుంటేశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘ కార్యాలయంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేస్తే రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా దిగుబడి అయిన పంటలను ఆహారంగా తీసుకుంటే సమాజంలో ఆరోగ్యంను పెంపొందించడవచ్చునన్నారు. ఈ విధానంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించ వచ్చునన్నారు. పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం వల్ల అధిక ఖర్చుతో నాసిరకం దిగుబడి పొందాల్సివస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మధులత, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, ప్రకృతి వ్యవసాయ సంఘ సభ్యులు హరికృష్ణారెడ్డి, వెంక టేష్, గౌతమి, అనిల్‌కుమార్, ఆర్ఎస్‌కె సిబ్బంది, సిసిలు, సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబుకే సాధ్యం

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం, డిసెంబర్ 17 ప్రభాతవార్త** గ్రామాల అభివృద్ధి సిఎం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కంగుందిలో 17లక్షలతో నూతన సిమె ంట్ రోడ్డు నిరా ్మణంకు ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంగుందిని పర్యాటక పరంగా అభివృద్ధి చేయడంతోపాటు గ్రామాన్ని సైతంమరింత అభివృద్ధి చేసేలా చర్యలుచేపట్టామన్నారు. జనవరి నెలలో తొలిసారి పెద్దఎత్తున బౌల ్డరింగ్ ఫెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సా ్థనిక శ్రీ ఆంజనేయస్వామి వి గ్రహంనుంచి బౌల్డరింగ్ సెంటర్ దాకా రోడ్డు నిర్మిస్తున్నటు చెప్పారు.మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసిడైరెక్టర్ ప్రేమ్‌కుమార్, మాజీఎంపిపి సాంబశివం, సర్పంచ్ ధనశేఖర్, కడసభ్యుడురామచంద్ర,నేతలుదివాకర్, హైదర్ వలీ, తిరుపతి, మునాఫ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఈఓచే హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

***తవణంపల్లె, డిసెంబర్ 17 ప్రభాతవార్త:*** మండల కేంద్రం తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తరగతుల వారిగా విద్యా ప్రమాణాలను పరిశీలించారు.అనంతరం విద్యార్థుల విద్యా ప్రమాణాలకు సంభందించి ఉపాధ్యాయుల సమావేశంలో చర్చించారు. జరగనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా భోదన వుండాలన్నారు. అలాగే జిల్లా లీగల్ ఆఫీసర్ వెంకటేష్‌తో కలసి బాల్య వివాహాలపై అవగాహన కలి ్పంచారు. అలాగే అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాల(బాలుర)లో సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించి విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంఈఓలు హేమలత, మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌రాజు ఇక లేరు!

### తిరుమల టిడిపి సీనియర్ నాయకుడు కన్నుమూత



తిరుమల,డిసెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీరామారావుకు అత్యంత సన్నిహితుడైన తిరుమలకొండపై ఎన్టీఆర్‌రాజు (రామచంద్ర) కన్నుమూశారు. ఆయన బుధవారం ఉదయం స్వగృహంలో తుదిశ్వాస విడిచారు.టిడిపి ఆవిర్భావం చేసినప్పటి నుండి టిడిపితో బాటు, పార్టీకి విధేయుడుగా ఉన్నారు. తిరుమలకు వచ్చిన ప్రతి సందర్భంలోనూ దివంగత ఎన్టీఆర్ ఏం రాజు బావున్నారా అని పలకరించేవారు. తిరుమల క్లస్టర్ ఇన్‌ఛార్జి, రాష్ట్రమీడియా కో ఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ తండ్రి ఈయన. ఆయన ఆత్మకు శాంతి కలగాలని పార్టీ ఎమ్మెల్యేలు,సీనియర్ నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

## తిరుపతి టౌన్‌బ్యాంకు వేధింపులతో బాధితుడు ఆత్మహత్య

తిరుపతి,డిసెంబర్ 17ప్రభాతవార్త: ఇంటిపై తీసుకున్న రుణంచెల్లించాలంటూ తిరుపతి టౌన్‌బ్యాంకు ఉద్యోగులు,పాలకమండలి చేసిన వేధింపులకు ఓ బాధితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. తిరుపతి ఎస్టీవినగర్‌లో ఉంటున్న మల్లారపు నాగయ్య(64)కొంతకాలం క్రిందట ఇంటిపై రుణం తీసుకున్నాడు. ఆ రుణం సకాలంలో తిరిగి చెల్లించలేకపోయాడు. టౌన్‌బ్యాంకు పాలకవర్గం, ఉద్యోగులు రుణాల వసూళ్ళపై ఒత్తిడి తీసుకురావడంతో ఆయన ఇంటికి తాళం వేశారు. ఆయన మనోవేదనతో మృతిచెందినట్లు కుటుం బసభ్యులు తెలిపారు. సిబ్బంది మానవతాదృక్పధంతో వ్యవహరించాలని కుటుంబసభ్యులు,కాలనీవాసులు కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నిస్వార్థంగా, సేవాభావంతో పనిచేయాలి

- సావిత్రమ్మ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కె మనోహర్



**చిత్తూరురూరల్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** చిత్తూరు పట్టణం, శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం బుధవారం వల్లియప్పనగర్ ప్రాథమిక పాఠశాలలో వారంరోజుల పాటు నిర్వహించే స్పెషల్ క్యాంపును కళాశాల ప్రిన్సిపాల్ డా.కె మనోహర్ అధ్యక్షతన ప్రారంభించారు. మొదటగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.షమ్స్అక్తర్ స్పెషల్‌క్యాంపు కార్యక్రమ వివరాలను, ప్రణాళికను సవివరంగా వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, ఉషారాణిలు మాట్లాడుతూ విద్యార్థి దశలో సేవాభావంతో పనిచేసే వాలంటీర్లు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారనీ, విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో భవిష్యత్తుకు బంగారుబాట వేసుకోవాలని, ముఖ్యంగా ఇటువంటి స్పెషల్ క్యాంప్‌ల వల్ల విద్యార్థులలో సమైక్యత భావం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వాలంటటీర్లు వారంరోజుల తమకు కేటాయించిన కార్యక్రమాలకు అనుగుణంగా గ్రామంలో ప్రజలకు విభిన్న అంశాలపట్ల అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమంత్‌కుమార్‌రెడ్డి, వన్‌స్టాప్ సెంటర్ ఆఫీసరు రాధారాణి, డా. జి. ధర్మమూర్తి,, వెంకటేశ్వర్లు, కుమారి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## రేపు గుండె సంబంధిత వ్యాధులపై ఉచిత వైద్యశిబిరం

**చిత్తూరురూరల్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** గుడిపాల మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణం నందు ఈనెల 19వతేదీ శుక్రవారం బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్యశిబిరంను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఒక ప్రకటన విడుదల చేసారు. ఉదయం 9గంటల ఉంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే శిబిరంలో గుండెకు సంబంధించిన వివిధ రకాల వ్యాధులకు హాస్పిటల్ వైద్యులు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వవారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తారన్నారు.నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

## 21న జరిగే పల్స్ పోలియోను విజయవంతం చేయండి



**సోమల డిసెంబర్ 17 (ప్రభాతవార్త)** ఈనెల 21న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని అధికారులందరూ సహకరించి విజయవంతం చేయాలని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి బాలాజీ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అంగన్వాడీలు ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బందితో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల పరిధిలో రెండు రూట్లు ఏర్పాటుచేసి 100!! ఫలితాలు రాబట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వైద్య విస్తరణ అధికారి ఉదయభాస్కర్ మాట్లాడుతూ 22 23 తేదీలలో ఇంటింటికి వెళ్లి తప్పిన పిల్లలకు పోలియో చుక్కలు ఇప్పిస్తున్నట్లు తెలియజేశారు. హెల్త్ సూపర్వైజర్ చంద్రమ్మ సురేంద్ర అంగన్వాడి సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు

## క్యాన్సర్ వ్యాక్సిన్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా చికిత్స పొందవచ్చు



**పూతలపట్టు, డిసెంబర్ 17 ప్రభాతవార్త** క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు రష్యా నుండి ఉచితంగా వ్యాక్సిన్ సరఫరా అవుతుంది. ప్రకటించిన వైద్యాధికారుని కోమల ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స సామాన్యుడికి అందుబాటులో లేని విధంగా ఖరీదుగా మారింది. రేడియేషన్ వంటి చికిత్సల కోసం లక్ష రూపాయలు సామాన్య పేదలు లక్ష రూపాయలు అప్పు చేసుకుని ధారబోసే ప్రక్రియ జరుగుతుంది. కానీ ఇటీవల మన భారతకు విచ్చేసిన రష్యా అధ్యక్షులు పుతిన్ పర్యటన ముగించుకుని రష్యా వెళ్ళిన తర్వాత భారత్లో క్యాన్సర్ బారిన పడుతున్న ప్రతి ఒక్కరికి ఉచితంగా వ్యాక్సిన్ సరఫరా చేస్తామని ప్రకటన జారీ చేశారు. ఈ వ్యాక్సిన్ వస్తే భారత్‌లో పేద బడుగు బలహీన వర్గాలు అగ్రవర్ణాల్లో ఎక్కడ కూడా క్యాన్సర్ మూలకాలు కనపడవని ఆ వ్యాక్సిన్ ద్వారా నయమవుతాయని పి. కొత్తకోట ప్రభుత్వ వైద్యాధికారిణి కోమల నిత్యం ఆసుపత్రికి వచ్చే రోగులకు తెలిపారు.

## పాత పెన్షన్ విధానం అమలు చేయాలి: కత్తి నరసింహారెడ్డి

**పుంగనూరు డిసెంబర్ 17 ప్రభాతవార్త** ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థిక భద్రతకు పాత పెన్షన్ వెంటనే అమలు చేయాలని మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన వారిని ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఉద్యోగులు తమ సేవాకాలంలో దేశాభివృద్ధికి అంకితభావంతో పని చేస్తారని, అలాంటి ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం భద్రమైన జీవితం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిఎస్పి సుకుమార్‌బాబు,బాబుభరత్‌భూషణ్, గంగులమ్మ, విశ్రాంత ఉద్యోగులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.



## ఎర్రచందనం స్వాధీనం



పుంగనూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త

శేషాచలం అటవీ ప్రాంతాల నుంచి ఎర్రచందనం దొంగలు యదేచ్చగా తరలిపోతూనే ఉన్నాయి. బుధవారం అటవీ శాఖ అధికారులు సోమల మండలం వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా తొగడం వారి పల్లి వద్ద ప్రయాణిస్తున్న ఒక కారు ఆగకుండా వెళ్ళిపోయింది. ఫారెస్ట్ అధికారులు కారును వెంబడించగా కారు వదిలి దుండగులు పారిపోయారు.కారులో 172 కేజీల ఐదు ఎర్రచందనం దుంగలు తో సహాకారు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు తెలిపారు

## సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం



**పుంగనూరు రూరల్ డిసెంబర్ 17 ప్రభాతవార్త** పట్టణంలోని కొత్త ఇండ్లు మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞాన ప్రతిభనువెలికితీయడంలోసైన్స్ ఎగ్జిబిషన్లు ఎంఈఓ నటరాజ రెడ్డి అన్నారు. పాఠ్యపుస్తకాల్లో నేర్చుకున్న విషయాలను ప్రయోగాత్మకంగా అమలు చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు పెరుగుతాయని అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు ముందుకు సాగేందుకు ఇలాంటి ప్రదర్శనలు బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు. మండల పరిధిలోని 46 పాఠశాలల విద్యార్థులు 130 శాస్త్రీయ ప్రయోగాలను ప్రదర్శించారు. పర్యా వరణ పరిరక్షణ, ఆరోగ్యం, శక్తి పొదుపు, ఆధునిక సాంకేతిక అంశాలపై రూపొందించిన ఉపాధ్యాయులు, అధికారులు,సందర్శకులనువిశేషంగాఆకట్టుకున్నాయిప్రదర్శనలనుతిలకించివిద్యార్థుల ప్రతిభను అభినందించారు.

## మల్బరీ సాగు లాభదాయకం



**పుంగనూరు రూరల్ డిసెంబర్ 17 ప్రభాతవార్త** సముద్ర మట్టానికి ఎత్తైన ప్రాంతాలైన పుంగనూరు రామసముద్రం చౌడేపల్లి సోమల తదితర ప్రాంతాలు మల్బరీ సాగుకు ఎంతో అనుకూలమైందని, మల్బరీ సాగుతో లాభాలు సాధ్యమని ఏఎస్ఓ అరుణ అన్నా రు అన్నారు. మండలం ఉలవలదిన్నె సమీపంలోని సచివాలయంలో రైతులకు పట్టుపురుగుల పెంపకం, మల్బరీ తోట నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. టీఏ నవీన్ బాబు పాల్గొని రైతులకు పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టుపురుగుల పెంపకానికి అవసరమైన షెడ్డును నిర్మించుకోవడానికి ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మల్బరీ సాగు చేపడితే తక్కువ పెట్టుబడితో మంచి లాభాలు పొందవచ్చని, సరైన విధానంలో సాగు చేస్తే సంవత్సరానికి సుమారు రూ.3 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. అలాగే మల్బరీ తోట నిర్వహణ, పురుగుల సంరక్షణ, వ్యాధుల నివారణ, మార్కెటింగ్ అవకాశాలపై రైతులకు సూచనలు అందించారు.

## విజ్ఞాన రంగంలో మీ ప్రతిభ మెరిసింది

**పాలసముద్రం డిసెంబర్ 17 ప్రభాతవార్త** మండలం లో బుధవారం అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు మండ లంలో ఉన్న ఐదు ఉన్నత పాఠశాలల విద్యారులు తమ ప్రయోగాలను ప్రదర్శించారు. కొంతమంది విద్యార్థులు వారి నైపుణ్యనీ ప్రదర్శిస్తూ సైన్స్ కు సంబంధించి పరికరాలను తయారుచేసి ప్రదర్శించారు ఇందులో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు పునిత్, ఢిల్లీ ప్రసాద్, రష్యా, వెట్రి వేలు,వినోద్, సిరి , చందన, రోహిత్ లు వీరిని జిల్లాస్థాయి లో సైన్స్ ఎగ్జిబిష న్ సెలెక్ట్ చేశామని మండల అదనపు ఎంఈఓ గిరిజ మరియు ఉపాధ్యాయులు తెలిపారు.



## ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

తలపా దామోదరం రెడ్డి

**శ్రీకాళహస్తి డిసెంబర్ 17 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళా రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ పంచుకొని ఘనంగా జరుపుకున్నారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ వైయస్ షర్మిలా రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పూర్వ వైభవం సంతరించుకుందని అదేవిధంగా రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రజల్లో మమేకమై కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు నూతన ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపుతూ కాంగ్రెస్ పార్టీని ముందుకు నడుపుతున్నటువంటి గొప్ప నాయకురాలు వైఎస్ షర్మిల రెడ్డి అదేవిధంగా మాట ఇస్తే తప్పని కుటుంబం వైయస్ కుటుంబమని, పోరాటాలకు స్ఫూర్తి వైయస్ షర్మిల రెడ్డి గ కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, మునికృష్ణయ్య, మహేష్,అరవింద్, నాగరాజు, అరుణ్, చరణ్, మునిరాజ, ప్రవీణ్, గురుసాయి, తరుణ్ ,అతిథి, సంజయ్, రామ,విజయ్ తదితరులు పాల్గొన్నారు



## ఇంటివద్దకే స్థిరం సహాయ



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 17 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వివిధ ఆనారోగ్యకారణాలతో బాధ పడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు అయిన సహాయాన్ని స్థానికశాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ చెక్కులను ఇళ్ళ వద్దకు అందిస్తున్నారు. ఈ నేపధ్యంలో బుధవారం పలువురి ఇళ్ళ వద్దకు వెళ్లి చెక్కులను అందించారు. చెక్కులు పార్టీ కార్యాలయం వద్ద కూడా ఇవ్వవచ్చు.కానీ బాధితులను పలకరించటంలో ఎంతో తృప్తి ఉంటుందని బృందమ్మ వివరించారు. అంతేకాక నిరుపేదలను ఆదుకొనుటకు శాసనసభ్యులు ఎంతో ఆతృత పడుతున్నారని ముఖ్యమంత్రి వద్దకు సరాసరి వెళ్ళి సమస్యను వివరించి సహాయ నిధులు సాధిస్తున్నారని వివరించారు. పట్టణంలోని పి,హరికృష్ణకు రూ.35వేలు, కే.లక్ష్మీకి రూ.1.34లక్షలు భక్త కంశేశ్వరనాయుడుకు రూ.45,350,టి.ధరణికి రూ.1,05,118లు మునెయ్యకు రూ.42,450, అన్వర్‌బాషాకు రూ.45,851 లు ఎం.ప్రవళికకు రూ.70,015లు,ఎం.ఇంద్రాణికి రూ.25,166లు, నాగమ్మకు రూ.51,612లు వెరసి రూ.5,54,612ల చెక్కులను అందించారు. ఆమెతో పాటు పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, కాసరం రమేస్, పేట బాలాజి, గుర్రప్పశెట్టి,,మునికృష్ణయ్య, అద్దంకి హేమంత కుమార్,షాకీర్ అలి, అస్మత్, ఖాదర్‌బాషా, రామచంద్రయ్య, కుమార్,శాంతమ్మ, గోవిదు, సుబ్రమణ్యం ,కిరణ్,వెంకటేశ్వర్లు, పద్మజ,మునిరాజాయాదవ్,సిఎస్‌మస్తాన్,సతీష్,సాంబారషీద్‌మధు, వివేక్,ము నీంద్ర షఫీ పాల్గొన్నారు.

## వికృతమాలలో సిసి రోడ్లకు భూమి పూజ



**ఏర్పేడు(శ్రీకాళహస్తిరూరల్),డిసెంబర్ 17 ప్రభాతవార్త** ఏర్పేడు మండలం వికృతమాల గ్రామంలో 200 మీటర్ల సిసి రోడ్ల నిర్మాణానికి బుధవారం తెలుగుదేశం నాయకులు భూమి పూజలు జరిపారు. మండల అధ్యక్షుడు పేరం నాగరాజనాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో శాసనసభ్యులు వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్బంగా బృందమ్మ మాట్లాడుతూ అభివృద్దికి బ్రాండ్ బొజ్జల కుటుంబం అన్నారు. సుధీర్‌రెడ్డి తన తండ్రిబాటలో నడుస్తున్నారని అభివృద్దికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులు నాయుడు నైనారు పొన్నారావు, బాలాజినాయుడు,మోహన్‌నాయుడు గుడిమల్లం ఆలయం చైర్మెన్ బత్తల గిరినాయుడు బాబునాయుడు, చిరంజీవులు నాయుడు, భూపతి నాయుడు, సుందరబాబు, కేశవులు, జయరామయ్య, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, జనార్ధన్, మురళి,మహేష్‌లు పాల్గొన్నారు.

## అధిక దిగుబడికి పంట మార్పిడి విధానాలు అనుసరించాలి



**తొట్టంబేడు, డిసెంబర్ 17 ప్రభాతవార్త** నేడు వ్యవసాయంలో వాతావరణ మార్పుల దృష్ట్యా అధిక దిగుబడికి రైతులు పంట మార్పిడి విధానాలను అవలంబించాల్సి ఉందని శాస్త్రవేత్తలు అన్నారు. బైపాస్‌రోడ్డులోని శివం కళ్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్గిస్తూ రైతులు మారుతున్న వాతావరణంతో శాస్త్రీయ పద్దతి వ్యవసాయంతోపాటు సంప్రదాయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. ముఖ్యంగా రైతులు పంట మార్పిడి విధానాలను ఆనుసరించాలన్నారు. ఒకే పంటతో దిగుబడి తగ్గుతుందన్నారు. స్పిక్ , గ్రీన్ స్టార్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యం లో బుధవారం శ్రీకాళహస్తిలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులతో రీజనల్ మేనేజర్ సి.గంగాధర్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి రైతులకు వివిధ పంటలకు అనుసరించాల్సిన పరిస్థితులపై అవగాహన కల్పించడం కోసం రైతులకు ఏం సమస్యలు ఉన్నాయో ఆ సమస్యలను వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో 350 రైతులు పాల్గొన్నారు. స్టేట్ మార్కెట్ డెవలప్మెంట్ మేనేజర్ నారాయణ రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్తలు కె. దేవకి , పి .మహేశ్వర్ రెడ్డి ,కె.విశ్వనాథ్ ,లీ. ఉమ మహేశ్వర్ రెడ్డి, సాయి కృష్ణ వారి సిబ్బంది పాల్గొన్నారు.

## మూడేళ్ళుగా చక్కర్లు కొడుతున్నా ముఖమైనా చూడటం లేదు.



**తొట్టంబేడు,డిసెంబర్ 17 ప్రభాతవార్త** మండలంలోని పెద్ద కనపర్తి గ్రామానికి చెందిన నాగూరమ్మ(70) మూడేళ్ళుగా మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని నాయకులకు చెబితే చూస్తాం! చేస్తాం!! అంటూ కాలయాపన చేస్తూ ప్రతి నెల తనను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని నాగూరమ్మ తమ బాధను విన్నవించుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దకనపర్తి గ్రామానికి చెందిన నాగూరమ్మ భర్త ఐదేళ్ళ క్రితం చనిపోయారు. గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుల వద్దకు ప్రదక్షణలు చేసాను. కానీ ప్రయోజనం లేదు.తరువాత అధికారుల వద్దకు దేహీ అంటూ తిరుగుతున్నా పట్టించుకునే దిక్కులేదు. తన బాధ గ్రామంలోని పార్టీ నాయకులకు తెలియనిది కాదు.కానీమూడేళ్ళుగాతిరుగుతున్నాఎందుకో అధికారులకు దయ కలగటం లేదని నాగూరమ్మ రోదించింది.

## మహిళా సమస్య పరిష్కారంలో ప్రభుత్వం వైఫల్యం

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 17 ప్రభాతవార్త** సమాజంలో మహిళల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫల మైందని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి నదియా విమర్శించారు. బుధవారం సిపిఐ పార్టీ కార్యా లయం లో మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. సమావే శానికి నదియా ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు పూర్తిగా భద్రత కరువైందన్నారు.ప్రభుత్వం పేరుకుచట్టాలు తెస్తున్నారు,కానీ ఆచరణలో అవి అమలు జరగక చట్టాలు మహిళల పాలిట శాపాలుగా మారుతున్నాయని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి పల్లెలోనూ, ప్రతి గల్లీలో బెల్టుషాపులు యధేచ్చగా వెలసి పేద,మధ్య కుటుంబాల పరిస్థితి ఛిన్నా భిన్నంగా మారుతున్నాయన్నారు. మద్యం ఏరులై పారుతున్నా సంబంధిత ఎక్సైజ్‌శాఖకు అధికార పార్టీ నాయకుల ఆదేశాలు తప్ప పేద ప్రజల జీవితాలు కనబడటం లేదన్నారు. ఈ కమిటిలో మంజులమ్మ, చారులత,,గీత,గంగాభవాని,సుబ్బమ్మ,రోజా,లక్ష్మీ,సుజాత,గంగమ్మ, మునెమ్మ, రత్నమ్మలు పాల్గొన్నారు.

## జిల్లా రైతు ప్రధమ సమావేశాన్నిజయప్రదం చేయండి:



**శ్రీకాళహస్తి,డిసెంబర్ 17 ప్రభాతవార్త** ఈ నెల 29న శ్రీకాళహస్తిలో జరగబోయే తిరుపతి జిల్లా రైతు సంఘ ప్రధమ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రామానాయుడు పిలుపు నిచ్చారు.పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలోరైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సభల్లో చర్చిస్తామన్నారు. ప్రభుత్వాలు కంటి తుడుపుగా సహాయాలు అందించి చేతులు దులుపుకుంటున్నారని వాస్తవంగా అవి అమలు జరగటం లేదని రామానాయుడు ధ్వజమెత్తారు.ప్రభుత్వాలు ప్రకటనల్లో చూపుతున్న ప్రగతి,సహాయం క్షేత్ర స్థాయిలో అమలుజరగటం లేదన్నారు. అప్పుల బాధలతో రైతుల ఆత్మహత్యలు ఇంకా సమసి పోవటం లేదన్నారు. సమావేశంలో తిరుపతిజిల్లా కో కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సిపిఐ నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య, సత్యవేడు ఇన్‌చార్జి చిన్నిరాజ్,మునస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంధోత్సవానికి రండి: బృందమ్మకు పిలుపు



**శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 17 ప్రభాతవార్త** శ్రీకాళ హస్తి పట్టణంలోని స్వర్ణముఖి తీరాన వెలసిన జుంలే పీర్‌షా వలిఅల్లాహ్ వారి దర్గాలో ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే గంధోత్సవానికి హాజరు కావాలని దర్గా కమిటి బుధవారం మండలంలోని ఊరందూరు గ్రాంలోని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బృందమ్మకు ఆహ్వానం పలికారు. దర్గాలో ఉరుసు ఈ నెల 25 నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. 26న గంధోత్సవం,27న ఆసారె షరీఫ్ వద్ద అన్నదానం 28న తహలీల్ ఫాతేహా జరుగుతుందని ఆమెకు వివరించారు.గుమ్మళ్ళ రాజేశ్వరరావు,గరికపాటి రమేష్,రాకేస్ కృష్ణ, మహబూబ్ షరీఫ్, రావిళ్ళ కళ్యాణమ్మ,యువ కిషోర్,సతీష్ చంద్ర,పుదూరు శరత్‌బాబు,ఉదయ్‌భాష్కర్, సూర్యకుమార్,జమ్రుద్‌బాషా, అబ్దుల్,నాగేశ్వరరావు, బాబాఫరీద్,సయ్యద్ అహమ్మద్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఉద్యోగులకు వైకుంఠద్వార దర్శనాలకు టిటిడియాప్

తిరుమల,డిసెంబర్ 17(ప్రభాతవార్త)ప్రతినిధి: తిరుమల ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి వైకుంఠ ఏకాదశి,ద్వాదశిన టిటిడి ఉద్యోగులు,వారికుటుంబసభ్యులకు ఉద్యోగుల ఐడి కార్డు ఆధారంగా రోజుకు వెయ్యిమందికి టిటిడి అధికారులు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే జనవరి 1వతేదీ నుండి 8వతేదీ వరకు 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శనం విధానంలో 1+5మందికి అవకాశం కల్పించారు. 25వతేదీ లోపు వెబ్.తిరుమల.ఓఆర్‌జి/ఎంప్)యాప్‌లో పేర్లనమోదుచేసుకోవాలని తెలిపారు.

## ఇండియా స్కిల్ కాంపిటీషన్ కి 9 మంది విద్యార్థినిలు ఎంపిక



**తిరుపతి విద్య,డిసెంబర్ 17 ప్రభాత వార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ ఎస్వీ డబ్ల్యు డిగ్రీ కళాశాల నందు ఈనెల 15,16 నిర్వహించినటువంటి స్కిల్ ఇండియా కాంపిటీషన్ 2025, ఆన్లైన్ పరీక్ష నందు సుమారు 85మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. అందులో భాగంగా 9 మంది విద్యార్థులు వివిధ రంగాలకి జిల్లా లెవెల్ లో సెలెక్ట్అయ్యారు.వీరికి ఈనెల 19వ తారీకు విజయవాడ నందు స్టేట్ లెవెల్ కాంపిటీషన్ జరగనుంది అని కళాశాల ప్రిన్సిపాల్‌డా టి నారాయణమ్మ తెలిపారు.అలాగే ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జిల్లా లెవెల్ లో సెలెక్ట్ అయినా విద్యార్థులు స్టేట్‌లెవెల్ తర్వాత నేషనల్ లెవెల్ లో సెలెక్ట్ అయ్యేలా ప్రయత్నం చేయాలి అని తెలిపారు.వివిధ రంగాల్లో ఎంపిక అయిఅలాగే ఎంపిక అయిన విద్యార్థినుల వివరాలు సైబర్ సెక్యూరిటీ1,డిజిటల్ మార్కెటింగ్ 2, మెకానిక్స్ 4, క్లౌడ్, కంప్యూటింగ్ 1,వెబ్ టెక్నాలజీ 1సెలెక్ట్ అయినా విద్యార్థుల కి ప్రిన్సిపాల్, స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ దీప,కళాశాల యాజమాన్యం శుభాకాంక్షలు తెలిపారు.

## యస్వీయూ పిజి ఫలితాలు విడుదల

**తిరుపతి విద్య,డిసెంబర్ 17 ప్రభాత వార్త** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని రెగ్యులర్ పి జి కోర్సుల మొదటి సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయం అధికారులు ఆచార్య సురేంద్రబాబు, డాక్టర్ రాజమా ణిక్యం ప్రకటించారుప్రకటించిన ఫలితాల్లో ఎ.ఏ.రూరల్ డెవలప్మెంట్, ఎకనామిక్స్, హింది,సీప్ స్టడీస్, టూరిజం,తెలుగుఎ.ఎస్సీ ఆక్వాకల్చర్,ఎనిమల్‌బయోటెక్నాలజీ,ఎం.కామ్,వాటితో పాటు,ఎల్.ఎల్.ఎం. నాల్గవ సెమిస్టర్ ఫలితాలు వెలువడ్డాయి. వీటిని సంబంధిత వెబ్సైటులో చూడవచ్చని వారు తెలిపారు.

## మలేషియాలో ఉన్నత విద్యా ఉద్యోగావకాశాలు.

మలేషియా సైన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ జియాంగ్ కౌన్యున్



**తిరుపతి విద్య,డిసెంబర్ 17 ప్రభాత వార్త** మలేషియాలో అనేక ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని మలేషియాలోని యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ చియాంగ్ కౌన్యున్ పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా ఎస్వీ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో ల్యాబ్ మెటీరియల్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ చియాంగ్ కౌన్యున్ పరిశీలించారు. మెటీరియల్ సైన్స్ పై ప్రామాణికత కలిగిన పరిశోధనలు సాగాలని ఆకాంక్షి ంచారు. పరిశోధనలకు కేంద్రంగా ఉండే గొప్ప ప్రయోగశాలలో పరికరాల పనితీరులు మెరుగుపరచుకోవడం అవసరమని చెప్పారు. ఎస్ వి యూనివర్సిటీ తో తాము అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్టు వెల్లడించారు. అధికారులతో సంప్రదింపులు చేస్తున్నామని వివరించారు. తాను చీఫ్ ఎడిటర్ గా ఉన్న మెటీరియల్ సైన్స్ ఇన్ సెమీ కండక్టర్ ప్రపోజల్స్ జర్నల్ కు యూనివర్సిటీ నుంచి పరిశోధకులు శాస్త్రవేత్తలు పరిశోధన వేషాలు పంపాలని కోరారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ చియాంగ్ కౌన్యున్ ను శిక్షణా కార్యక్రమం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## వెటర్నరీ పీజీ విద్యార్థులకు ఎర్న్ వైల్ యు లెర్న్ పౌల్ట్రీ పథకం అమలు



**తిరుపతి విద్య,డిసెంబర్ 17 ప్రభాత వార్త** తిరుపతి వెటర్నరీ కళాశాలలోని పౌల్ట్రీ సైన్స్ విభాగం, రెగ్యులర్ యుజి, పిజి బోధనతో పాటు, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఎర్న్ వైల్ యు లెర్న్ పౌల్ట్రీ ప్రాజెక్ట్ అనే పథకాన్ని అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా, విద్యార్థులు చదువుకుంటూనే కోళ్ల నిర్వహణలో, ముఖ్యంగా వాణిజ్య బ్రాయిలర్, పిట్టల పెంపకంలో ఆచరణాత్మక శిక్షణ పొందుతారు. ఈ పథకం 1981-82 నుండి అమలులో ఉంది. ఎంపిక చేయబడిన నాల్గవ సంవత్సరం బి వి ఎస్ సి, ఏహెచ్, విద్యార్థుల బృందానికి 300 బ్రాయిలర్ కోళ్ల యూనిట్ నిర్వహణ బాధ్యత ఇవ్వబడింది. కోళ్లకు మేత, నీరు, టీకాలు, మందులు అందించడం, కోళ్లను అమ్మడం వంటి అన్ని పనులలో విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొంటారు.పాల్గొనే విద్యార్థులకు కోళ్ళ పెంపక ఖర్చులు, మార్కెట్ ధరలను బట్టి ఒక్కో విద్యార్థికి రూ. 2,000 నుండి రూ. 2,500 వరకు లాభం వస్తుంది. ఈ సంవత్సరం కూడా జూలై ఆగస్టులో ఎనిమిది మంది విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. ప్రతి విద్యార్థికి రూ. 2000 ఆదాయం, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. జగపతి రామయ్య విద్యార్థులకు సర్టిఫికెట్లు, లాభాల మొత్తాన్ని పంపిణీ చేయడమే కాకుండా, భవిష్యత్తులో పౌల్ట్రీ సైన్స్‌కు ఉన్న ప్రాధాన్యతను, పౌల్ట్రీ రంగం ఎలా ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందిందో అవగాహన కల్పించారు.

## మాకిచ్చిన డీకేటీ పట్టాలకు భూములను చూపించండి



**విజయపురం, డిసెంబరు 17 ప్రభాతవార్త:** మండలంలోని క్షూరికాపురం ఆది ఆంధ్రవాడ వాసులకు అప్పటి ప్రభుత్వం 2010లో విజయపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను ఐదో విడత భూ పంపిణీలో భాగంగా డీకేటీ పట్టాలు జారీ చేశారు. ఈ భూములకు అప్పటి నుంచి లబ్ధిదారులు మండల రెవెన్యూ అధికారులను మాకిచ్చిన డీకేటీ భూములకు సర్వే చేసి హద్దులు చూపించాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు డీకేటీ పట్టా భూములను సంబంధిత రెవెన్యూ అధికారులు చూపించిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందు వల్ల ఆ భూములను తారు సాగులోకి తీసుకురాలేకపోతున్నామని తెలిపారు. బుధవారం జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కైలాసం యాదవ్, జనసేన జిల్లా నాయకుడు స్వామినాథన్ ఆధ్వర్యంలో డీకేటీ భూముల లబ్ధిదారులు మండల తహసీల్దార్ కిరణ్‌ను కలసి వినతిపత్రం అందించి మాకు న్యాయం చేయాలని విన్నవించారు. అంతేకాక తామంతా సెంటు భూమి లేని నిరుపేద దళితులమని పేర్కొన్నారు. మాకు రైతు భరోసా నగదు కూడా వస్తోందని, భూములను సాగులోకి తెచ్చుకుని వీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాము, బీజేపీ కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విజ్ఞాన సృజనాత్మకత

ఎంఈఓ శ్రీవరం లలితకుమారి



**చంద్రగిరి, డిశంబర్ 17 ప్రభాతవార్త:** విద్యార్థులలో దాగివున్న విజ్ఞాన సృజనాత్మకతను వెలికితీయడంలో సైన్స్ ఎగ్జిబిషన్ దోహదపడగలదని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఆమె మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలను పరిశీలించి, వాటి పనితీరుని విద్యార్థుల ద్వారా తెలుసుకుని అభినందించారు. విద్యార్థులు విజ్ఞాన శాస్త్ర నూతన నమూనా ఆవిష్కరణలతో ఆకట్టుకుంటున్నట్లు తెలిపారు. చిన్నతనం నుండి సైన్స్ పట్ల విద్యార్థులు అవగాహన కలిగివుండాలన్నారు. అనంతరం ఎంఈఓ 2 భాస్కర్‌బాబు ప్రస్తుత పోటీ ప్రపంచంలో నేటి తరం విద్యార్థులు పోటీని ఎదుర్కోవాలంటే సృజనాత్మక పరిశీలన కలిగివుండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మురుగునీరు నిల్వ .. భరించలేని దుర్వాసన



**చంద్రగిరి, డిశంబర్ 17 ప్రభాతవార్త:** జాతీయ రహదారిపై మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన భరించకున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయలపురం పంచాయతీ, వెంకటంపేట వద్ద మెయిన్ రోడ్ ప్రక్కన మురుగునీరు నిలిచిపోయి దోమల బెడద వేధిస్తున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగునీటిని తొలగించి, బ్లీచింగ్ చేయడంతో పాటు దోమల నివారణకు మిలాథిన్ ఆయిల్‌ను పిచికారి చేయాలని కోరుతున్నారు. పంచాయతీలో ఫాగింగ్ చేయించాలని కోరుతున్నారు.

## విద్యాభివృద్ధికి దాతలు సహకరించండి..!

**రామచంద్రాపురం, డిశంబర్ 17 ప్రభాతవార్త:** విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని ఏపి ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ చినబాబు కోరారు. బుధవారం చేకూరి నాగమ నాయుడు యర్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సొసైటీ ఫర్ సోషల్ సర్వీసెస్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యశించే పేద విద్యార్థులకు స్వచ్ఛంధ సంస్థలు, దాతలు విరివిగా సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఏకాగ్రతతో విద్యనభ్యశించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, టిడిపి నాయకులు నరశింహారెడ్డి, రావిళ్ళ గిరి, విజయ్‌కుమార్ రెడ్డి, ఎంఈఓలు మార్కొండేయ నాయుడు, జయవేలు, హెచ్‌ఎం సునిత,స్వచ్ఛంధసంస్థఅధ్యక్షుడు సుబ్రమణ్యం, ఆర్గనైజర్ యువరాజ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## పెరటి కోళ్ళ పెంపకంతో మహిళల ఆర్థిక అభివృద్ధి



**రామచంద్రాపురం, డిశంబర్ 17 ప్రభాతవార్త:** పెరటి కోళ్ళ పెంపకంతో గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపిఎం గురుమూర్తి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు 100 యూనిట్లు పెరటి కోళ్ళను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంకరజాతి వంగడాలను అభివృ చేసి పెరటి కోళ్ళను సరఫరా చేశారన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఏపిఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ చినబాబు మాట్లాడుతూ ప్రతి మహిళ ఒక పారిశ్రామిక వేత్తగా తయారు కావాలన్నారు.సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్ధన్ చౌదరి, టిడిపి నాయకులు నరశింహారెడ్డి, గిరి, విజయ్‌కుమార్ రెడ్డి, పశువైద్యాధికారులు డాక్టర్ భువనేశ్వరీ, డాక్టర్ జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్

నారాయణాద్రి హాస్పిటల్ వారిచే ప్రజలకు ఉచిత వైద్య సేవలు



**తిరుచానూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీ తిరుచానూరు మండలం ఆధ్వర్యంలో శేషాద్రి నగర్ నందు డిఎం మాస్టర్ హెల్త్ కేర్ మరియు వాసన్ ఐ కేర్ వారి సహకారంతో మెగా మెడికల్ క్యాంప్‌ను బుధవారం విజయవంతంగా నిర్వహించారు.ఈ మెడికల్ క్యాంప్‌లో సాధారణ వైద్య పరీక్షలు, కంటి వైద్య పరీక్షలు, రక్తపోటు, షుగర్ వంటి ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి వైద్యుల సూచనలు మరియు మందులు అందజేశారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం పరిరక్షణే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తిరుచానూరు మండల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, డిఎం మాస్టర్ హెల్త్ కేర్ మరియు వాసన్ ఐ కేర్ వైద్యులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండలాధ్యక్షుడు శుభకర్, ఉపాధ్యక్షులు నాగరాజు రెడ్డి, తిరుచానూరు గ్రామ అధ్యక్షులు ఇంద్రారెడ్డి,మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు పుష్ప రెడ్డి,టిడిపి పాడిపేట బిసి నాయకులు గోపాల్, చిన్ని, కమలాకర్ రాజు, టిడిపి బి సి సాధికార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నా రవి కుమార్, శేషాద్రి నగర్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం-

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మధ్య అవగాహన ఒప్పందం



**తిరుపతి యూనివర్సిటీ, డిసెంబర్ 17 ప్రభాతవార్త** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి లోని ఎస్‌ఎస్‌ఐఐఈ-టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తిరుపతి మధ్య స్టార్టప్ మరియు ఆవిష్కరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి అవగాహన ఒప్పందం కుదిరింది.ఈ అవగాహన ఒప్పందంపై ఎస్‌ఎస్‌ఐఐఈ టిబిఐ తరఫున ప్రొఫెసర్ ఎన్. రజని, మరియు ఆర్‌టీఐహెచ్ - తిరుపతి తరఫున డాక్టర్ విజయ్ మాథూర్ సంతకాలు చేశారు. ఈ కార్యక్రమం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వి. ఉమ సమక్షంలో, ఇరు సంస్థల ప్రతినిధులను అభినందించారు ఒప్పందం ద్వారా తిరుపతి ప్రాంతం స్టార్టప్‌లు, పరిశోధన మరియు సాంకేతిక ఆవిష్కరణలలో మరింత ముందుకు సాగనుందని తెలిపారు

## నేసనూరులో సమస్యలు తిష్ట



**పుత్తూరు రూరల్, డిసెంబరు 17 ప్రభాతవార్త:** పుత్తూరు మండల పరిధిలోని నేసనూరు పంచాయతీ నేసనూరు గ్రామంలో సమస్యలను పట్టించుకోని అధికారులు ఈ గ్రామంలో సుమారు 50 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. మూడు వీధులు ఉన్నాయి. అందులో రెండు వీధులకు సిమెంటు రోడ్డు వేసి ఒక వీధికి సిమెంటు రోడ్డు లేకపోవడంతో ఆ రోడ్డులో వెళ్లాలంటే ఇటీవల కురిసిన వర్షాలకు ఆ రోడ్డు బురదమయంగా తయారైంది. ద్విచక్రవాహన దారులకు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే గ్రామంలో డ్రైనేజీ కాలువలు కంపు కొడుతోందని, మురికినీరు ముందుకు సాగడం లేదని, ఈ గ్రామంలో మాత్రం ఈ సమస్య ఎన్నో ఏళ్లుగా ఉందన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. మురుగునీరు ముందుకు సాగకపోవడంతో దోమలకు నిలయంగా మారిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలు : ఎంపీడీవో



**సత్యవేడు, డిసెంబరు 17 ప్రభాతవార్త:** వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో అంతర్గీతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చునని సత్యవేడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో రవి ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ నేటి పౌరులే రేపటి యువ శాస్త్రవేత్తలుగా రాణిస్తారన్నారు. అయితే తరగతి గదుల్లోవిద్యతో పాటు వైజ్ఞానికంగా విద్యార్థులు ముందుకు వెళ్ళడానికి ఉపాధ్యాయుల కృషి చేయాలన్నారు. ఇందుకు తగినట్టుగా పాఠశాల యాజమాన్యాలు కూడా సహకరిస్తే యువ శాస్త్రవేత్తలుగా విద్యార్థులు గుర్తింపు తెచ్చుకుంటారన్నారు. అంతకు ముందు ఎంపీడీవో మండల పరిషత్ పరిపాలనాధికారి త్రివిక్రమరావు, ఎంఈవో రవి తదితరులు పలు ప్రాజెక్టులు సంబంధించి విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలించి తిలకించారు. ఈ నేపథ్యంలో గ్రూపుకు సంబంధించి మానవుని గుండె పని విధానం, హై డ్రాలిక్ జాక్, హెడ్ క్వింటర్ మానవుని, ఎంబ్రాయినియర్, వ్యక్తిగతానికి సంబంధించి నేచురల్ ఎయిర్‌కూలర్, సాండ్ క్లీనర్, ఉపాధ్యాయుల ప్రదర్శనలో భాగంగా సోలార్ ఫెన్సింగ్ తదితర ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఉష, పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ఒత్తిడి వద్దు ఆత్మవిశ్వాసమే ముద్దు కార్యక్రమం.

**తిరుపతి విద్య,డిసెంబర్ 17 ప్రభాత వార్త** తిరుపతి జిల్లా విద్యాశాఖ రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డిల్లీ పబ్లిక్ స్కూల్ మినీ ఆడిటోరియం నందు నేడు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు పదవ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడి, భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, సమయ నిర్వహణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపు వంటి అంశాలతో పాటు విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలపై అవగాహన మరియు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్ విధానంపై ప్రత్యక్ష ప్రదర్శన,అంశాలపై మానసిక వైద్య నిపుణుల ద్వారా మార్గదర్శనం అందించనున్నారు.ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా 300 మంది విద్యార్థులు వీక్షి ంచేలా ఐ.ఎఫ్. పి ప్యానెల్ ద్వారా తరగతి గదుల్లో పరోక్షంగా తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉన్నత పాఠశాల విద్యార్థులూ చూడడానికి,వినడానికి వీలుగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్ కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## సంస్కృత వర్శిటీలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం

**తిరుపతి విద్య,డిసెంబర్ 17 ప్రభాత వార్త** జాతీయ సంస్కృత వర్శిటీ లో మహిళా విభాగం, ఇంటర్న ...య బాలికలు , మహిళా అధ్యాపకులు, సిబ్బందికి ...పై అవగాహన వర్కషాప్ కార్యక్రమం నిర్వహించడం ...ంపై అవగాహన కోసం మహిళలకు ఈ వర్కషాప్ ...ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణ అఫైర్స్ హాజరయ్యారు.మీరా రాఘవేంద్ర, ఉమెన్ ఇనిషియేటివ్ తిరుపతి కార్యక్రమానికి సంబంధించిన అన్ని విషయాలపై పి.పి.టి. ఏర్పాటు చేసి వివరించడం జరిగింది. ప్రధానంగా లైంగిక వేధింపులపై అవగాహన, ఇటువంటి సమస్యల నివారణ పరిష్కారంపై అత్యంత చక్కగా వివరించడం జరిగినది.వి.సి.ప్రొ.కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్శిటీ లో మహిళల, విద్యార్థినుల సంరక్షణ కొరకు అత్యంత నిబద్ధతతో ముందుకు వెళ్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంతా ఉమెన్స్ సెల్ చైర్పర్సన్ ప్రొ.ఆర్.జె.రమాశ్రీ కన్వీనర్గా వ్యవహరించి అత్యంత దిగ్విజయంగా నిర్వహించడం జరిగినది. ఐ.సి.సి మెంబర్ సెక్రటరీ డా.జి.నాగలక్ష్మి ...్మ కోకన్వీనర్గా వ్యవహరించి కార్యక్రమాన్ని అత్యంత దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రొ.ఎన్.లత, ప్రొ.ఆర్.దీప్త, ప్రొ.కె.కాదాంబిని, డా.పారమిత పండ, డా.మేరీ సుజాత, డా.బుల్టీదాస్, విభిన్న విభాగాల మహిళా అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థినులు పాల్గొని పాల్గొన్నారు.



## ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు

నైపుణ్యాభివృద్ధి కోర్సులపై అవగాహన కార్యక్రమం





**తిరుపతి విద్య,డిసెంబర్ 17 ప్రభాత వార్త** స్థానిక బాలాజీ కాలనీ లో ఉన్న ఎస్.వి.ఆర్ట్స్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. వెణుగోపాల్ రెడ్డి అధ్యక్షత వహించి, నియలైట్ అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతి సంవత్సరం పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఎస్.వి. ఆర్ట్స్ కళాశాల - నియలైట్ మధ్య ఎంఒయూ కుదుర్చుకునే యోచన ఉందని తెలిపారు.ఆకుల పవన్, సైంటిస్ట్‌సి, నియలైట్ తిరుపతి ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐఓటీ , ఎ ఐ వంటి రంగాల్లో ప్రాక్టికల్ శిక్షణ కలిగిన కోర్సుల గురించి వివరించారు. ఈ కోర్సులకు అకాడమిక్ క్రెడిట్లు ఉండి, అవి విద్యార్థుల డిజిలాకర్ ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు కోర్సులు ఉచితంకాగా ఇతరులకు స్వల్ప ఫీజుతో అందుబాటులో ఉంటాయని చెప్పారు.అధ్యాపకులు,ప్రథమ, ద్వితీయ సంవత్సరం బి.ఎస్.సి విద్యార్థులు పాల్గొన్నారు.

## షణ్ముగంరెడ్డిని కలసిన విజయపురం నాయకులు



**విజయపురం, డిసెంబరు 17 ప్రభాతవార్త:** తెలుగు దేశం పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన షణ్ముగంరెడ్డిని బుధవారం కలియంబాకం చెరువు నీటి సంఘ అధ్యక్షుడు గాలి రమేష్‌నాయుడుతో పాటు మండలంలోని పన్నూరుకు చెందిన బెంజిమెన్ లక్ష్మయ్య, బాబు, దొరైరాజులు మర్యాదపూర్వకంగా కలసి శాలువ కప్పి అభినందించారు.

## బెల్ట్ షాపులు నుంచి కాపాడండి మహా ప్రభో

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త



పరిశ్రమల కోసం పదిమంది బాగుకోసం మా స్థలాలను సైతం ఇచ్చి ఎన్నో పరిశ్రమల స్థాపనకు కారకులు అయ్యాము. కానీ పరిశ్రమల అభివృద్ధి బాగున్న మా పరిస్థితి బెల్ట్ షాపుల సుడిగుండంలో చుట్టుకుని విలవిలలాడే పరిస్థితి నెలకొంది. వివరాలలోకి వెళితే తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం కోనేటి రాజుపాలెం గ్రామస్తులు బుధవారం నాయుడుపేట ఎక్సైజ్ శాఖ సిఐ అరుణకుమారికి వినతిపత్రం అందజేసి తమ గోడును వెళ్ళబుచుకున్నారు. స్పందించిన సిఐ అరుణ కుమారి రక్షణ చర్యలు చేపట్టి గ్రామంలో ప్రశాంతత నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. ఫిర్యాదు అందించిన గ్రామస్తులలో నాయుడుపేట ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు ఆ గ్రామవాసి ముప్పాళ్ళ చంద్రరాజు, గ్రామ నాయకులు కొండూరు గురు ప్రసాద్ రాజు, ముప్పాళ్ళ సత్యం రాజు, మనోజ్ రాజు, మస్తాన్ రాజు, రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయులు ముప్పాళ్ళ అక్బర్ రాజులు సంతకాలతో కూడిన వినతి పత్రం అందించే వారిలో ఉన్నారు.

## పోలేరమ్మ హుండి ఆదాయం రూ. 4.18 లక్షలు

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త



నాయుడుపేటలో వెలసి ఉన్న శ్రీ పోతురాజు సమేత శ్రీ పోలేరమ్మ మాత దేవాలయ హుండి ఆదాయం 4.18159 నాలుగు లక్షల 18 వేల 159 రూపాయలు ఆదాయం వచ్చింది. బుధవారం ఆలయ ఆవరణంలో జరిగిన లెక్కింపులో ఈ మొత్తం ఉన్నట్లు ఆలయ చైర్మన్ నానా బాల సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారికి వచ్చిన ఆదాయాన్ని ఆమె సేవకు ఉపయోగిస్తూ భక్తుల సౌకర్యార్థం అన్ని పూజ కార్యక్రమాలకు ఉపయోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో రవి కృష్ణ, యుగంధర్, ప్రముఖ విద్యావేత్త ఆధ్యాత్మికవేత్త గాదిరెడ్డి గోపి, నల్లబోతుల రామారావు, రిటైర్డ్ ఏఎస్ఐ బిఎల్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## పేటలో రిటైర్డ్ ఎంప్లాయిస్ 44వ పెన్షనర్స్ దినోత్సవం

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నాయుడుపేట యూనిట్ ఆధ్వర్యంలో సంఘ భవనంలో బుధవారం 44వ పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. అధ్యక్షులు ఆదవరం నాగూరయ్య, జిల్లా కార్యదర్శి, గౌరవ అధ్యక్షులు పేర్నాటి. వెంకటేశ్వర్లు, పూర్వ అధ్యక్షులు పిడి ఉదయశంకర్, ప్రధాన కార్యదర్శి సి. శశిధర్, కోశాధికారి బి. సుబ్రహ్మణ్యం, అసోసియేట్ అధ్యక్షులు ఎ. ప్రమీల దేవి, ఇతర కార్యవర్గ సభ్యులు, హాజరయ్యారు. డి.ఎస్. నకర పోరాట ఫలితంగా డిశంబర్ 17,1982 నాడు సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి వై. వి. చంద్రచూడ్ వెలువరించిన తీర్పు పెన్షనర్స్ పాలిట వరమైనందుకు వారికీ నివాళ్ళుఅర్పించారు. కావేరిపాకం సాయిబాబాని ఘనంగా సన్మానించారు.

## ఏకీకృత కుటుంబ సర్వేపై అవగాహన

వాకాడు, డిసెంబర్ 17, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఏకీకృత కుటుంబ సర్వే పై ఎంపీడీవో సాయిప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణం లోని స్త్రీ శక్తి భవనంలో మండల సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలకి ఏకీకృత కుటుంబ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిప్రసాద్ మాట్లాడుతూ ఏకీకృత కుటుంబ సర్వేలో ప్రభుత్వ నిబంధన ప్రకారం ఆర్థిక,సామాజిక, విద్య, ఉద్యోగ, ఇతరేతరపై సిబ్బంది ఇంటింటికి వెళ్లి పూర్తిస్థాయిలో పూర్తిస్థాయిలో కుటుంబ సభ్యుల పేర్లు, కులం ఆదాయం, తప్పనిసరిగా సర్వే మొదలు పెట్టాలని ఎంపీడీవో సాయిప్రసాద్ సిబ్బందికి సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రతిభ రాణి, ఏవో శ్రీనివాసులు, రెవెన్యూ విఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి రూ. 11 కోట్ల 36 లక్షలు మంజూరు

### - గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త

నియోజకవర్గంలో 33 ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కి 11 కోట్ల 36 లక్షల రూపాయలు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కూటమి ప్రభుత్వం విహెచ్‌సి, పిహెచ్‌సి, ఏహెచ్‌లు అభివృద్ధి చేస్తుందన్నారు. గత ప్రభుత్వం హయాంలో నియోజకవర్గంలో ఉన్న హాస్పిటల్స్‌లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలలో నియోజకవర్గం నందు 33 హాస్పిటల్స్ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు.

**చిట్టమూరు పిహెచ్‌సికి 1 కోటి 43 లక్షలు, మల్లాం పిహెచ్‌సికి 1 కోటి 43 లక్షలు,**

గూడూరు ఏరియా హాస్పిటల్‌కి 1 కోటి 25 లక్షలు, బాలిరెడ్డిపాలెం పిహెచ్‌సికి 1 కోటి 43 లక్షలు, చింతవరం పిహెచ్‌సికి 50 లక్షలు, నియోజకవర్గంలో 33 పిహెచ్‌సి, సిహెచ్‌సిల అభివృద్ధికి ప్రధాన మంత్రి ఆయుష్మాన్ పథకం, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల కింద 11 కోట్ల 36 లక్షల రూపాయలు మంజూరు చేసిన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యం

### - డిప్యూటీ డీఈవో సనత్ కుమార్



వెంకటగిరి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు వంద రోజులు సాధన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ డీఈవో సనత్ కుమార్ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని జడ్పీ, ఆర్‌విఎం ఉన్నత పాఠశాలలను డిప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ చేశారు. మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించే విధంగా వారికే ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు జరిపారు. వంద రోజులు కార్యక్రమం పేరుతో విద్యార్థులను బాగా చదివిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి వారి ద్వారా సమాధానం రాబట్టారు. నోట్ బుక్స్ పరిశీలించారు. ఆయన వెంట వల్లభ దాసు, బాబి శర్మ, శ్రీనివాసులు,పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## మ్యాథమెటిక్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులుగా భాస్కర్ రెడ్డి ఎన్నిక

వెంకటగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటిక్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులుగా గంగలపూడి భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంకటగిరి మండలం, సోమశానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయులు గంగలపూడి భాస్కర్ రెడ్డి పని చేస్తున్నారు. విజయవాడలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర గణిత ఫోరం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సభ్యులందరూ భాస్కర్ రెడ్డి సేవలను, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. టెక్నాలజీ, గణిత బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలోనూ, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వినూత్నమైన బోధనా అభ్యాసన సామాగ్రిని రూపొందించడం లోనూ రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారు. డిజిటల్ టూల్స్ ద్వారా గణితాన్ని బోధించడంలో ఆయనకున్న నైపుణ్యం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారింది. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన గణిత ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్షులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అమలాపురంకు చెందిన డాక్టర్ టిఎస్‌విఎస్ సూర్యనారాయణ మూర్తి, ఇతర జిల్లాల ప్రతినిధులు సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

## ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

గూడూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త



జాతీయ పెన్షనర్ల దినోత్సవ సందర్భంగా గూడూరు నందు డాక్టర్ సిఆర్ రెడ్డి పెన్షనర్స్ భవన్లో రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటానని, ఇకమీదట ప్రతి ఏటా జరిగే పెన్షనర్ల దినోత్సవం ఆర్థికంగా అయ్యే ఖర్చు తాను భరిస్తానని, తన కుటుంబంలో కూడా చాలామంది రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ అయినా మీ అందరి ఆశీస్సులు తనకు ఉండాలని, కూటమి ప్రభుత్వం దశలవారీగా గత ప్రభుత్వంలో ఇవ్వనటువంటి ఉద్యోగ పెన్షనర్ల బాకీలను చెల్లించడం జరుగుతూ ఉన్నదని రాష్ట్ర ఉద్యోగ సంఘ జేపీసీ చైర్మన్ విద్యాసాగర్ కూడా తెలియజేశారని తెలిపారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘ గౌరవ అధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్ వారి తండ్రి జ్ఞాపకార్థం రిటైర్డ్ అయిన ఉద్యోగస్తులకు, మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మహబూబ్ బాషా, డాక్టర్ సి జనార్దన్ రెడ్డి, ఏపీ పిఆర్‌డి ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ అహ్మద్, సంఘ కార్యదర్శి ఎం మోహన్, సహ అధ్యక్షుడు ఏ భాస్కరరావు, పురుషోత్తమరావు, ట్రెజరర్ ఎన్ వి కృష్ణయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి కే సుందర్రామయ్య, పెన్షనర్లు స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ స్వామి, చీఫ్ మేనేజర్ ఎస్ఎస్ఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు. 34 మంది రిటైర్డ్ ఉద్యోగస్తులకు ముఖ్య అతిథులకు మెమొంటోలతో ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మానించారు.

## ఘనంగా మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు

గూడూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త

మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలకు మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి కాంచనమ్మ, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ఎంవి భారతి హాజరయ్యారు. మండల పరిధిలో జరిగిన సైన్స్ ఫెయిర్ పోటీలో వివిధ రంగాలపై విద్యార్థులు చేసిన వివిధ ప్రాజెక్టులలోని ప్రయోగాలను మండల విద్యాశాఖ అధికారి కాంచనమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కాంచనమ్మ మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, పరిశోధనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం కోసం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించడం జరిగిందని, పాఠశాల స్థాయిలో మొదలై, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

# గూడూరు డివిజన్

## విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



సూళ్లూరుపేట డిసెంబర్ 17 (ప్రభాతవార్త)

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కోట పోలూరు బాలురు హైస్కూల్‌ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలని కోరారు. పాఠశాలలో ల్యాబ్‌లను పనితీరును పరిశీలించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా. ఉండాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలల దీటుగా విద్య బోధనలో ముందుండాలని తెలియజేశారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



సూళ్లూరుపేట డిసెంబర్ 17 (ప్రభాతవార్త)

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రవేశ పెట్టనున్న పెన్షన్ విధానానికి స్వస్తి పలికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సూళ్లూరుపేటలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు

## ఏడిపిఎస్ మహాసభను విజయవంతం చేయండి

సూళ్లూరుపేట, డిసెంబర్ 17 (ప్రభాతవార్త)

అంబేద్కర్ ధర్మ పోరాట సమితి స్థాపించి 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 25న నిర్వహించనున్న జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఏడిపిఎస్ వ్యవస్థాపకులు ఇంగ్లాండ్ రామచంద్రరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నెల్లూరులోని అంబేద్కర్ భవన్లో నిర్వహించే ఈ సభలో బౌద్ధ ధర్మ స్వీకరణ కార్యక్రమాన్నిచేపడతామని చెప్పారు. బౌద్ధ ధర్మంపై ఆసక్తి గలవారు ముందుకు వచ్చి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాలని ఆయన కోరారు. . ఈ కార్యక్రమంలో ఏడిపిఎస్ నాయకులు వై సుబ్రహ్మణ్యం , కే గోపి, సిహెచ్ మాధవయ్య, ఏ చెంగయ్య, ఎం వెంకటేష్, డి సుధాకర్, పి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఊనుగుంటపాళెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోట, డిసెంబర్ 17 ప్రభాతవార్త



కోట మండలం ఊనుగుంటపాళెం గ్రామంలో బుధవారం ఎంవిరావు పౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని హెచ్ఎం రాజ కుమూర్ ప్రారంభించారు రమేష్ ఐకేర్ హస్పిటల్ నేతృత్వంలో విద్యార్ధులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకుమూర్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాల నుంచి ఎంవిరావు పౌండేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 10 వేలకి పైగా సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంవిరావు భౌతికంగా లేకపోయిన ఆయన ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. అనంతరం విద్యార్దులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిఁని చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, మస్తాన్, జనార్దన్, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో రోడ్డు నిర్మాణం

కోట, డిసెంబర్ 17 ప్రభాతవార్త

ఇటీవల దిత్వ తుపాన్ కారణంగా మండలంలోని ఊనుగుంటపాళెం.. రుద్రవరం గ్రామాల మద్య రోడ్డు తెగిపోయింది. దీంతో రెండు గ్రామాల కు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో స్దానిక తెదేపా నాయకులు రఘరామిరెడ్డి తన్నమాల కోటారెడ్డి గూడూరు శాసన సభ్యులు పాశం సునీల్ కుమూర్ దృష్టికి ఈ సమస్యను తీసుకుని వేళ్లారు. ఆమేరకు శాసన సభ్యులు సునీల్ కుమూర్ ఆదేశాలతో తాత్కాలికంగా గ్రావేల రోడ్డు వేశారు. దీంతో గ్రామస్దులు శాసన సభ్యులు సునీల్ కుమూర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## అడవి పంది దాడి: వ్యక్తి మృతి

చిల్లకూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త

మండల పరిధిలోని తూర్పు కనుపూరు గ్రామం పంచాయతీలో ఉన్న ఈదురువారిపాలెం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అడవి పందులు చంపేందుకు వేటకు వెళ్లగా అక్కడ వలలు పని అడవి పందులను తరుముకొని వస్తుండగా ఓ పంది నల్లం రమణయ్య (54) సంవత్సరాలు కలిగిన వ్యక్తి పై అడవి పంది దాడి చేసి అతి దారుణంగా చంపేసింది. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఏరియా హాస్పిటల్‌కి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## అలంకరణ చేపల పెంపకంపై శిక్షణ

శ్రీసిటీ, డిసెంబర్ 17, ప్రభాతవార్త

తడ మండలం ఎంపీడీవో కార్యాలయం నందు బుధవారం అలంకరణ చాపల పెంపకం పై మత్స్యశాఖ ఆధ్వర్యంలో (జిసిఎఫ్ ఈసిఆర్ఐసికె) ప్రాజెక్టు సహకారంతో మత్స్యశాఖ మహిళలకు సంఘ సభ్యులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. భారతదేశ తీరప్రాంత వాసులలో ప్రతికూల వాతావరణ పరిస్థితులలో సామర్థ్యాన్ని పెంపొందించడం ముఖ్య ఉద్దేశ్యంతో జిసిఎఫ్ మరియు ఎస్ఆర్ పి సమన్యం ద్వారా 100 శాతం నిధులు మరియు మత్స్య శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా అలంకరణ చేరుల పెంపకం పై శిక్షణా మార్కెటింగ్ పై సంపూర అవగాహన కల్పించడం జరిగింది అలంకరణ చేపల పెంపకం పై ఈనెల ఆఖరుకు ప్రాజెక్టు జిల్లా కలెక్టర్ కార్యరూపం దాల్చునుంది అని, మత్స్యశాఖ వారి సైడ్లైన్స్ ప్రకారం ఒక్క యూనిట్‌కి 3 కుటుంబాలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, ఎంపీడీవో శేఖర్ నాయక్, ఏడి రాజేష్, డిస్టిక్ కోఆర్డినేటర్ జస్వంత్, మండల మత్స్య శాఖ అభివృద్ధి మహిజ, ఏపీఎం రాజారెడ్డి, పొదుపు గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పీ

వెంకటగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త

వార్షిక తనిఖీల్లో భాగంగా వెంకటగిరి పోలీస్ స్టేషన్‌ను గూడూరు డిఎస్పి గీతాకుమారి తరికి చేశారు. పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కేసుల పెండింగ్ పై డిఎస్పి సిఐ ఏవి రమణ, ఎస్సైలు ఏడుకొండలు, నవిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేరు బాగుందని సిఐ, ఎస్ఐలను డి.ఎస్.పి అభినందించారు.

## కాణిపాకం సన్నిధిలో పలువురు ప్రముఖులు





కాణిపాకం, డిసెంబర్ 17 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కుటుంబసమేతంగా వేర్వేరుగా కాణిపాకం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ చైర్మన్ మణినాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. వారి వెంట ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి: పరిశోధనల్లో రాణించాలి

### ఎఇఓ భువనేశ్వరి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలలో చదివే ప్రతి ఒక విద్యార్థి ఓ శాస్త్రవేత్తగా ఎదగాలని, కొత్త ఆవిష్కరణలకు పరిశోదనలకు తెర తీయాలని శ్రీకాళహస్తి విద్యాశాఖాధికారి భువనేశ్వరి పిలుపు నిచ్చారు. ఇక్కడి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి 'సైన్స్' ఫేర్‌కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 90 ప్రదర్శనలకు సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య వివరించారు. ఈ సైన్స్ ఫేర్‌కు తల్లిదండ్రుల నుంచి ఎంతో స్పందన వచ్చింది.

జిల్లా స్థాయికి ఎన్నికైన అంశాలు:

శ్రీకాళహస్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అవరణలో ఏర్పాటుచేసిన సైన్స్ ఫేర్‌కు 90 అంశాలు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చాయి. వాటిలో కొన్నింటినిజిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రధానోఏపాధ్యాయులు వెంకటయ్య తెలిపారు. ఈ ఎపోటీల్లో ఉపాధ్యాయ విభాగాల్లో సెవెన్ థీమ్స్ నుంచి ప్రదర్శించారు. జిల్లా స్థాయికి వ్యక్తిగత విభాగం నుంచి తొండమనాడు పాఠశాలకు చెందిన విద్యార్థి పి. భవేష్ రూపొందించిన పోల్యూషన్ కంట్రోల్, శ్రీకాళహస్తిలోనిజిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్. లిఖిత రూపొందించిన వాటర్ కన్జర్వేషన్ అండ్‌మేనేజ్‌మెంట్, శ్రీకాళహస్తి మండలం వేడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి విష్ణువర్ధన్, రూపన్‌లురూలపొందించిన గ్రీన్ ఎనర్జిలు ఎంపిక చేసారు.

## ధనుర్మాసపూజల్లో భజనలతో గోవిందుని ఆరాధన

తిరుపతి, డిసెంబర్ 17ప్రభాతవార్త:



భగవంతుని ధ్యానంతోనే ముక్తిపొందవచ్చని, పవిత్రమైన ధనుర్మాసంలో బుధవారం వేకువజామున పెద్దకాపువీధిలోని రామభజనమందిరంలో భజనలతో గోవిందుని స్తుతించారు. రాయలసీమరంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, రామభజనమందిరం నిర్వాహకులు, స్థానికులు తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, వెంకటనారాయణ, మునికృష్ణయ్య, చిన్నప్ప, సుబ్రమణ్యం, గంగయ్య, తిరుపాల్‌ఆచారి, సురేష్‌స్వామి, లోకప్రభాకర్‌నాయుడు, కొట్టేసుబ్రమణ్యం తదితరులు కలసి భజనలు చేశారు. ఉభయదారులుగా మోహన్‌రామిరెడ్డి దంపతులు వ్యవహరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ధనుర్మాస నైవేద్యప్రసాదం పంపిణీ చేశారు.

## గొబ్బెమ్మ పుర ప్రదర్శన: భక్తి భావంతో పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 17 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నెల నెలా ఓ ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. ఈ నేపధ్యంలో ధను ర్మాసం నెల రోజుల పాటు గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించటం ఆనవాయితీ. ధనుర్మాసం సందర్భంగా అమ్మవారిని గొబ్బెమ్మగా ఊరేగించటం ఆనవాయితీ. ఈ నేపధ్యంలో బుధవారం ధనుర్మాసం సందర్భంగా అమ్మవారు గొబ్బెమ్మగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో దేవేరిని కన్నుల పండువగా అలంకరించి బోయిలు మోసుకుంటూ శివయ్య మండపం నుంచి రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. అక్కడ నుంచి వాహనంపై అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. గొబ్బెమ్మ పట్టణంలో గ్రామోత్సవం రావటంతో ఇంటింటా నాలుగుమాడావీధుల్లో అమ్మవారికి హారతులందించి మొక్కులు తీర్చుకున్నారు.

ముక్కంటీశుని దర్శన వేళలివే . . .

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసం సందర్భంగా దర్శన వేళలు మార్పు చేసినట్లు ఇఓ ఇఓ డి. బాపిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15 వరకు దర్శన వేళలను ఉత్సవాల వివరాల్ని ఆయన ప్రకటించారు. నెల రోజుల పాటు దర్శన వేళలకు సంబంధించి వివరిస్తూ వేకువ జాము 3గంటలకు పురవీదుల్లో జేగంట పంపుట. 4గంటలకు మంగళవాయిద్యాలు,, 4.15 గంటలకు తిరుమంజనం 4.30గంటలకు గోపూజ, పళ్ళియార, తేవారం ఉంది. 5గంటలకు ప్రధమ కాలభికేం,(సేవలుండవు) 6గంటలకు ద్వితీయకాలాభికేం,(సేవల్లేదు), 7గంటలకు పరివార దేవతలకు నైవేద్యం, 7.30గంటలకు గొబ్బి ఉత్సవం, 10.30గంటలకు ఉచ్చికాల అభికేం, సాయంత్రం 5గంటలకు ప్రదో కాలాభికేం, రాత్రి మంగళవారం, బుధవారం, గురువారం రాత్రి 8.30గంటలకు పళ్ళియార, శుక్ర, శని, ఆది, సోమవారం రాత్రి 9గంటలకు పళ్ళియార కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

జనవరి 3న ఆరుద్ర:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే అభిషేకాల్లో శివయ్య జన్మదిన నక్షత్రం సందర్భంగా నిర్వహించే అభిషేకాన్ని అరుద్రాభిషేకం అంటారు. ఈ అభిషేకం జనవరి 3న నిర్వహించనున్నట్లు వివరించారు.

## నగరిలో కొండ చుట్టు మండపాన్ని కూల్చకండి

### ఆర్డిఒకు వైకాపా ప్రజాప్రతినిధుల వినతి

పుత్తూరు (నగరి), డిసెంబరు 17 ప్రభాతవార్త :



నగరిలో వున్న కొండ చుట్టు మండపాన్ని కూల్చవద్దంటూ ప్రజాప్రతినిధుల బృందం బుధవారం ఆర్డిఒకు వినతిపత్రం సమర్పించారు. ఆరు శతాబ్దాలుగా చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన మండపాన్ని రహదారి వెడల్పు పేరిట తొలగించడం సమంజసం కాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. కొండచుట్టు ఉత్సవాల సమయంలో 21 మంది దేవతలు వినాయకుని సాక్షిగా మండపంలో కొలువుతీరుతారని తెలిపారు. ఈ మండపం తొలగింపునకు వచ్చే నెల 20వ తేదీ వరకూ గడువు ఇచ్చారని ప్రజలు ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. రోడ్డు వెడల్పునకు తగిన స్థలం వున్నందున మండలం తొలగించకుండా జాతీయ రహదారి నిర్మించుకోవచ్చని తెలిపారు. మండలం తొలగిస్తే నియోజకవర్గానికి అరిష్టం ఏర్పడుతుందని స్థానికుల విశ్వాసమని తెలిపారు. స్థానికుల సెంటిమెంట్‌తో ముడిపడిన సున్నితమైన ఈ అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జాతీయ రహదారి ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్రరావుకు మండపాన్ని కూల్చవద్దని పోస్ట్ ద్వారా వినతిపత్రం పంపించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పి.జి.నీలమేఘం, వైస్‌చైర్మన్ వెంకటరత్నం, ఎంపిపి భార్గవి, వైస్ ఎంపిపి కన్నియప్ప, కౌన్సిలర్లు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## బంగారు పతకం సాధించిన శ్రీ వివేకానంద జూనియర్ కాలేజ్ విద్యార్థులు

చిత్తూరు, డిసెంబర్ 17 ప్రభాతవార్త ప్రతినిధి



పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గతవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 బాలికల విభాగంలో ఫెన్సింగ్ క్రీడలలో చిత్తూరు శ్రీవివేకానంద జూనియర్ కాలేజీ విద్యార్థి జి. రమ్య జూనియర్ ఎంపీసీ బంగారు పతకం సాధించింది. అలాగే హాకీ క్రీడల్లో చిత్తూరు జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆర్జె నీతి ఆర్జె కీర్తి కవల పిల్లలు అయిన వీరు చిత్తూరు జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా తృతీయ బహుమతి సాధించారు. క్రమశిక్షణకు విద్యతోపాటు క్రీడాభివృద్ధిలో కూడా శ్రీ వివేకానంద కాలేజ్ ముందుంటుందని కాలేజీ కరస్పాండెంట్ భాస్కర్ నాయుడు మహేంద్ర కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మా కాలేజీలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణ కలిగిన నిపుణులైన ఫిజికల్ డైరెక్టర్ దేవరాజులు ఫిజిక్స్ లెక్చరర్ మరియు ప్రిన్సిపల్ అయిన మురళి రెడ్డి మరియు రవీందర్ రెడ్డి వీరి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీల్లో శరీర దారుఢ్యంలో శిక్షణతో పాటు విద్యార్థులకు మెలుకువలు బోధించినట్లు తెలిపారు. అలాగే చిత్తూరు నగరంలోని శ్రీవివేకానంద జూనియర్ కాలేజ్ కామేశ్వర్ నగర్‌లో ఉన్న కళాశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్లు భాస్కర్ నాయుడు మహేంద్రకుమార్ ప్రిన్సిపాల్లు మురళిరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులు కళాశాలతో మంచి గుర్తింపును తీసుకొచ్చారని విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

## యస్వీయూలో భూగర్భశాస్త్ర విభాగంలో కార్యశాల

తిరుపతి విద్య, డిసెంబర్ 17 ప్రభాత వార్త



యస్వీయూలో భూగర్భశాస్త్ర విభాగంలో రెండు రోజుల కార్యశాల ప్రారంభోత్సవం జరిగింది. కేంద్ర భూగర్భజల బోర్డు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని యస్వీయూ జియాలజీ విభాగం నిర్వహిం చింది. తిరుపతి జిల్లాలోని జలమయ స్తరాలపై ప్రత్యేక ప్రాధాన్యతతో భూగర్భ జల అభివృద్ధి , నిర్వహణ పద్ధతులు అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన యస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు మాట్లాడుతూ భారతదేశంలో జల నిర్వహణ ప్రణాళికలు కొత్త తరహాలో సాగుతున్నాయని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ తిరుపతి గొప్ప ఆధ్యాత్మిక, యాత్రికుల సందర్శన కేంద్రమని, ఇక్కడ మనం నీటి నిర్వహణ, భూగర్భజలాల సంరక్షణపై దృష్టి పెట్టాలని తెలిపారు. భూగర్భ జలవనరుల సంస్థ రీజినల్ డైరెక్టర్ , హైద్రాబాద్ జ్యోతి కుమార్ కీలకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమాన్ని జియాలజీ విభాగం అధ్యక్షులు ఆచార్య డి. మధు నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు ఆచార్య సుధారాణి మాట్లాడారు.